


# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక

ప్రశ్నించడం మన హక్కు






సంపుటి : 1 సంచిక : 260 పేజీలు :8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : ఒంగోలు సోమవారం 25 మే 2026 వెల : 1/-రూ ॥

VOLUME :1 ISSUE :260 PAGES :8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : ONGOLE MON 25 MAY 2026 PRICE : 1/- RS

Simultaneously Published form Ongole,Visakhapatnam,Kakinada,Bapatla,Narasarao Peta, YSR Kadapa,Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari,West Godavari,Eluru,Guntur,SPSR Nellore,Tirupati,Chittor,Kurnool,Anantapur




## జగన్ మళ్లీ సీఎం అవుతారని చంద్రబాబుకు భయం పట్టుకుంది

- కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత పెరిగిందన్న అంబటి
- అందుకే చంద్రబాబు వైసీపీపై బురదజల్లడమే పనిగా పెట్టుకున్నారని విమర్శ
- చంద్రబాబు, లోకేష్ రాష్ట్రాన్ని దోచుకుంటున్నారని ఆరోపణ

కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత తీవ్రస్థాయిలో పెరిగిందని, దాని నుంచి దృష్టి మళ్లించేందుకే సీఎం చంద్రబాబు డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని వైసీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి అంబటి రాంబాబు మండిపడ్డారు. తాడేపల్లిలో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ... జగన్ మళ్లీ ముఖ్యమంత్రి అవుతారనే భయం చంద్రబాబుకు పట్టుకుందని, అందుకే నిరంతరం వైసీపీపై బురదజల్లడమే పనిగా పెట్టుకున్నారని ధ్వజమెత్తారు. వైఎస్ కుటుంబానికి పులివెందులలో ఎన్నడూ ఓడిపోయిన చరిత్ర లేదని ఆయన గుర్తుచేశారు. చంద్రబాబు నియంతలా రాష్ట్రాన్ని పాలిస్తున్నారని, అధికారంలోకి వచ్చాక రూ. 3.5 లక్షల కోట్లు అప్పు తెచ్చిన కూటమి ప్రభుత్వం ఆ నిధులతో రాష్ట్రానికి

- మిగతా 2లో



## జగన్ రక్తచరిత్ర అందరికీ తెలుసు.. వచ్చే ఎన్నికల్లో వైసీపీకి 'జీరో'నే

- వైఎస్ కుటుంబ రక్త చరిత్ర తెలిసే.. ప్రజలు వైసీపీని 11 సీట్లకు పరిమితం చేశారన్న నారాయణ
- స్వచ్ఛ భారత్ నిధులను కూడా గత వైసీపీ ప్రభుత్వం దారి మళ్లించిందని ఆరోపణ
- ఈసారి హైబ్రిడ్ విధానంలో మహానాడు కార్యక్రమం జరుగుతుందన్న మంత్రి

వైసీపీ అధినేత జగన్ లక్ష్యంగా మంత్రి పి. నారాయణ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. రాష్ట్రంలో రక్తచరిత్ర ఎవరిదో ఆంధ్రప్రదేశ్ ప్రజలందరికీ బాగా తెలుసని, జగన్ అండ్ కో ఎన్ని అసత్యాలు మాట్లాడినా జనం నమ్మే పరిస్థితిలో లేరని మండిపడ్డారు. వైఎస్ కుటుంబం, వైసీపీ రక్తచరిత్ర ప్రజలకు తెలుసు కాబట్టే... గత అసెంబ్లీ ఎన్నికల్లో ఆ పార్టీని కేవలం 11 సీట్లకే పరిమితం చేశారని, వచ్చే ఎన్నికల్లో వారికి సున్నా (జీరో) సీట్లు రావడం ఖాయమని జోస్యం చెప్పారు. నెల్లూరు

- మిగతా 2లో

# ఇది జగన్ రెడ్డి వంకర బుద్ధికి నిదర్శనం

- విద్యార్థి మిత్ర కిట్ల పంపిణీ రద్దు కాలేదని ప్రభుత్వం స్పష్టీకరణ
- పశ్చిమాసియా యుద్ధం కారణంగా నెలరోజులు ఆలస్యం
- పాఠశాలలు తెరిచేనాటికి పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్ పంపిణీ
- యూనిఫాం, బూట్లు, బ్యాగ్‌ల సరఫరాకు కొంత సమయం
- వైసీపీ తప్పుడు ప్రచారం చేస్తోందన్న మంత్రి నారా లోకేష్



ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర కిట్లను పూర్తిగా నిలిపివేసిందంటూ సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారాన్ని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ తీవ్రంగా ఖండించారు. ఈ ప్రచారం వందశాతం అవాస్తవమని, కిట్ల పంపిణీని ఆపే ఉద్దేశం ప్రభుత్వానికి లేదని ఆయన స్పష్టం చేశారు. కేవలం కొన్ని అంతర్జాతీయ కారణాల వల్ల కిట్ల సరఫరాలో సుమారు నెల రోజుల జాప్యం జరుగుతోందని తెలిపారు. ప్రభుత్వం నిజాయతీగా జాప్యం గురించి వెల్లడిస్తే, దానిని వక్రీకరించి అసలు కిట్లే ఇవ్వరంటూ వైసీపీ పార్టీ విష ప్రచారం చేస్తోందని ఆయన ఆరోపించారు. ఇది జగన్ రెడ్డి వంకర బుద్ధికి నిదర్శనమని విమర్శించారు. పశ్చిమాసియాలో యుద్ధ పరిస్థితుల కారణంగా ముడిసరుకుల ధరలు పెరగడం, రవాణాకు ఆటంకాలు ఏర్పడటంతో యూనిఫాం క్లాత్, బూట్లు, బ్యాగుల సరఫరా ఆలస్యమవుతోందని విద్యాశాఖ అధికారులు తెలిపినట్లు లోకేష్ వివరించారు. అయితే, జూన్ 12న పాఠశాలలు పునఃప్రారంభమయ్యే నాటికి విద్యార్థులందరికీ పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్ కచ్చితంగా అందజేస్తామని హామీ ఇచ్చారు.

మిగిలిన వస్తువులను కూడా వీలైనంత త్వరగా పంపిణీ చేసేందుకు అధికారులు తయారీ సంస్థలతో నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నారని లోకేష్ పేర్కొన్నారు.

## ఎబోలాపై ఏపీ ప్రభుత్వం దృష్టి.. విమానాశ్రయాల్లో ప్రత్యేక నిఘా



- ఆఫ్రికా దేశాల్లో వేగంగా పెరుగుతున్న ఎబోలా కేసులు
- అక్కడి నుంచి వచ్చే ప్రయాణికులకు విమానాశ్రయాల్లోనే వైద్య పరీక్షలు నిర్వహించాలని నిర్ణయించిన ప్రభుత్వం
- ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే రోడ్డు మార్గాలపై కూడా నిఘా

- మిగతా 2లో

## విజయ్ గెలుపు ఒక 'సినిమా సునామీ'.. ఆ ప్రభుత్వం ఎప్పుడైనా కూలిపోవచ్చు

- తమిళనాడులో అధికార, విపక్ష పార్టీల మధ్య మొదలైన మాటల యుద్ధం
- విజయ్ ప్రభుత్వం ఐదేళ్ల పాటు కొనసాగలేదన్న స్టాలిన్
- టీవీకే పార్టీ మేజిక్ ఫిగర్ మార్కును కూడా దాటలేక పోయిందని ఎద్దేవా

- మిగతా 2లో




## నిప్పులకొలిమిలా ఆంధ్రప్రదేశ్...

### తూర్పుగోదావరిలో 48.3 డిగ్రీలతో సీజన్ రికార్డు

- తూర్పుగోదావరి జిల్లా చిట్యాలలో 48.3 డిగ్రీల రికార్డు ఉష్ణోగ్రత నమోదు
- రాష్ట్రవ్యాప్తంగా పలు జిల్లాల్లో 44 డిగ్రీలు దాటిన పగటి ఉష్ణోగ్రతలు
- మరో 3 రోజుల పాటు తీవ్ర వడగాల్పులు తప్పవని ఏపీఎస్డీఎంఏ హెచ్చరిక
- సోమవారం 29 మండలాల్లో తీవ్ర వడగాల్పులు, 166 మండలాల్లో వడగాల్పుల అంచనా
- కొన్ని జిల్లాల్లో పిడుగులతో కూడిన వర్షాలకు అవకాశం ఉందని వెల్లడి

- మిగతా 2లో





## బలూచిస్థాన్‌లో రక్తపాతం..

పాక్ సైనికులు వెళుతున్న రైలుపై ఉగ్రదాడి.. 24 మంది మృతి

- క్వెట్టాలో జరిగిన ఉగ్రదాడిలో 24 మంది మృతి
- మృతుల్లో సైనిక సిబ్బంది, వారి కుటుంబ సభ్యులు
- కారు బాంబుతో దాడి చేసినట్లు వెల్లడి

- మిగతా 2లో

## మూర్ఖులు ఎక్కడైనా ఉంటారు



- భారత పర్యటనలో ఉన్న రూబియో
- అమెరికాలో భారతీయ సమాజం గొప్పగా రాణిస్తోందని వ్యాఖ్య
- కొన్ని గంటల్లో ప్రపంచానికి ఒక శుభవార్త అందే అవకాశం ఉందన్న రూబియో

- మిగతా 2లో

### హర్మూజ్ జలసంధి తెరుస్తాం.. ఆంక్షలు ఎత్తివేయండి:

## అమెరికాతో ఇరాన్ డీల్?

- అమెరికా, ఇరాన్ మధ్య 60 రోజుల కాల్పుల విరమణ ఒప్పందానికి చర్చలు
- హర్మూజ్ జలసంధిని తిరిగి తెరిచేందుకు ఇరాన్ సుముఖత
- ఇరాన్ చమురు అమ్మకాలపై ఆంక్షల ఎత్తివేతకు అమెరికా అంగీకారం
- అణు కార్యక్రమంపై ఇరు దేశాల మధ్య కొనసాగుతున్న భిన్నాభిప్రాయాలు
- ఒప్పందంపై త్వరలోనే శుభవార్త ఉండొచ్చన్న అమెరికా విదేశాంగ మంత్రి

- మిగతా 2లో



## కర్ణాటకలో విషాదం... ఆల్చిప్పల కోసం నదిలో దిగి 8 మంది మృతి

- కర్ణాటక భట్కళ్‌లో నదిలో గల్లంతై 8 మంది మృతి
- ముత్యపు చిప్పల సేకరణకు వెళ్లగా పెరిగిన ప్రవాహంతో ప్రమాదం
- మృతుల్లో ఏడుగురు మహిళలు, ఒక పురుషుడు
- మరో ముగ్గురి కోసం కొనసాగుతున్న గాలింపు చర్యలు
- మృతుల కుటుంబాలకు రూ. 5 లక్షల పరిహారం ప్రకటించిన సీఎం సిద్ధరామయ్య

- మిగతా 2లో



# ఎడిటర్ వ్యూ

## నిప్పులకొలిమిలా ఆంధ్రప్రదేశ్...
## తూర్పుగోదావరిలో 48.3 డిగ్రీలతో సీజన్ రికార్డు

ఆంధ్రప్రదేశ్‌లో భానుడు తన ప్రతాపాన్ని చూపిస్తూ రికార్డు స్థాయిలో ఉష్ణోగ్రతలను నమోదు చేస్తున్నాడు. ఆదివారం (మే 24) తూర్పుగోదావరి జిల్లా చిట్యాల వద్ద ఈ సీజన్‌లోనే అత్యధికంగా 48.3 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదైంది. రాష్ట్రవ్యాప్తంగా ప్రజలు తీవ్రమైన ఎండలు, ఉక్కపోతతో అల్లాడిపోతున్నారు. రాబోయే మూడు రోజుల పాటు ఇదే తీవ్రత కొనసాగుతుందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ (ఏపీఎస్డీఎంఏ) హెచ్చరించింది. ఆదివారం పలు జిల్లాల్లో ఉష్ణోగ్రతలు 44 డిగ్రీల మార్కును దాటాయి. తూర్పుగోదావరి జిల్లాలోని గోపాలపురంలో 48.3, ఉండ్రాజవరంలో 48.1 డిగ్రీలు నమోదవగా, పశ్చిమ గోదావరి జిల్లాలోని అత్తిలి, ఇరగవరం, తణుకులో 48.1 డిగ్రీల చొప్పున ఉష్ణోగ్రతలు రికార్డయ్యాయి. పల్నాడు జిల్లా పిడుగురాళ్లలోనూ 48.1 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. ఏలూరు జిల్లా కుక్కునూరులో 47.3, కృష్ణా జిల్లా నందివాడలో 47.1 డిగ్రీల తీవ్రత కనిపించింది. వీటితో పాటు కోనసీమ, కాకినాడ, ఎన్టీఆర్, బాపట్ల, ప్రకాశం జిల్లాల్లోని అనేక మండలాల్లో 44 నుంచి 47 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. బాపట్ల జిల్లా నిజాంపట్నంలో 46.2, కాకినాడ జిల్లా కాజులూరులో 46.5, ఎన్టీఆర్ జిల్లా మైలవరంలో 45.7 డిగ్రీల చొప్పున ఉష్ణోగ్రతలు రికార్డవ్వడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. సోమవారం (మే 25) కూడా ఎండల తీవ్రత కొనసాగుతుందని వాతావరణ శాఖ అంచనా వేసింది. రాష్ట్రంలోని 29 మండలాల్లో తీవ్ర వడగాల్పులు, 166 మండలాల్లో వడగాల్పులు వీచే అవకాశం ఉందని తెలిపింది. ముఖ్యంగా కోనసీమ, గోదావరి జిల్లాలు, ఏలూరు, ఎన్టీఆర్, కృష్ణా, గుంటూరు, బాపట్ల, పల్నాడు, ప్రకాశం జిల్లాల్లో ఉష్ణోగ్రతలు 45 నుంచి 47 డిగ్రీల వరకు చేరవచ్చని హెచ్చరించింది. విజయనగరం, మన్యం, కాకినాడ, మార్కాపురం, నెల్లూరు జిల్లాల్లో 43 నుంచి 45 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని పేర్కొంది. ఒకవైపు ఎండలు మండిపోతున్నా, మరోవైపు ద్రోణి ప్రభావంతో కొన్ని ప్రాంతాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. మార్కాపురం, ప్రకాశం, కర్నూలు, నంద్యాల, అనంతపురం, చిత్తూరు జిల్లాల్లో అక్కడక్కడ పిడుగులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు పడొచ్చని సూచించింది. ఈ నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ముఖ్యంగా ఉదయం 11 నుంచి సాయంత్రం 4 గంటల వరకు బయటకు వెళ్లవద్దని అధికారులు సూచించారు. ఉరుములు, మెరుపులతో వర్షం పడే సమయంలో చెట్ల కింద, విద్యుత్ స్తంభాల సమీపంలో నిలబడరాదని హెచ్చరికలు జారీ చేశారు.

## ఎబోలాపై ఏపీ ప్రభుత్వం దృష్టి..
## విమానాశ్రయాల్లో ప్రత్యేక నిఘా

ఆఫ్రికా దేశాలలో ఎబోలా వైరస్ కేసులు వేగంగా పెరుగుతున్న నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అప్రమత్తమైంది. వైరస్ వ్యాప్తిని అరికట్టేందుకు రాష్ట్ర వైద్యారోగ్య శాఖ రంగంలోకి దిగింది. ముఖ్యంగా ఆఫ్రికాలోని కాంగో, ఉగాండా, సూడాన్ వంటి దేశాల నుంచి ఆంధ్రప్రదేశ్‌కు వచ్చే ప్రయాణికులకు విమానాశ్రయాల్లోనే ముందస్తు వైద్య పరీక్షలు నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. రాష్ట్రంలోని అంతర్జాతీయ ప్రయాణాలు జరిగే విశాఖపట్నం, తిరుపతి, విజయవాడ విమానాశ్రయాలపై వైద్యారోగ్య శాఖ ప్రత్యేక దృష్టి సారించింది. వైద్యారోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ఈ వ్యవహారంపై అన్ని జిల్లాల అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. ఎబోలా వైరస్ నియంత్రణకు అవసరమైన అన్ని ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని స్పష్టం చేశారు. కేవలం విమానాశ్రయాలే కాకుండా, రాష్ట్రంలోని ప్రధాన ఓడరేవులు, అలాగే పొరుగు రాష్ట్రాల నుంచి వచ్చే రోడ్డు మార్గాల్లోనూ నిఘా ఉంచాలని మంత్రి ఆదేశించారు. ప్రయాణికులలో ఎవరికైనా ఎబోలా వైరస్ లక్షణాలు కనిపిస్తే, వారిని తక్షణమే ఐసోలేట్ చేసి క్వారంటైన్‌కు తరలించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్లు మంత్రి సత్యకుమార్ వెల్లడించారు. ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, అయితే అప్రమత్తంగా ఉండటం అవసరమని అధికారులు పేర్కొంటున్నారు.

## బలూచిస్థాన్‌లో రక్తపాతం..

పాకిస్థాన్‌లో ఘోర ఉగ్రదాడి జరిగింది. బలూచిస్థాన్ ప్రావిన్స్‌లో సైనిక సిబ్బంది, వారి కుటుంబ సభ్యులు ప్రయాణిస్తున్న రైలును లక్ష్యంగా చేసుకుని ఉగ్రవాదులు దాడికి పాల్పడ్డారు. ఈ ఘటనలో కనీసం 24 మంది మరణించగా, 50 మందికి పైగా తీవ్రంగా గాయపడ్డారు. మృతుల్లో సైనికులు కూడా ఉన్నట్లు ఓ సీనియర్ అధికారి వెల్లడించారు.

బలూచిస్థాన్ రాజధాని క్వెట్టాలో ఆదివారం ఈ దాడి జరిగింది. క్వెట్టా నుంచి పెషావర్‌కు వెళుతున్న ఈ రైలులో సైనికులు, వారి కుటుంబసభ్యులు ఉన్నారు. మంగళవారం నుంచి ప్రారంభం కానున్న బక్రీద్ పండుగ కోసం వీరంతా తమ స్వస్థలాలకు పయనమయ్యారు. రైలు క్వెట్టాలోని చమన్ పట్టక్ వద్ద సిగ్నల్ దాటుతున్న సమయంలో పేలుడు పదార్థాలతో నింపిన కారుతో ఒక బోగీని ఉగ్రవాదులు ఢీకొట్టారు. దీంతో భారీ పేలుడు సంభవించిందని అధికారులు తెలిపారు. ఈ పేలుడు తీవ్రతకు రైలు బోగీ నుజ్జునుజ్జయి పక్కకు ఒరిగిపోయింది. పలు కోచ్‌లు పట్టాలు తప్పాయి. ఘటనా స్థలంలో సహాయక చర్యలు చేపట్టారు. రక్తంతో తడిసిన బాధితులను స్ట్రెచర్లపై తరలిస్తున్న దృశ్యాలు హృదయవిదారకంగా ఉన్నాయి. భద్రతా దళాలు ఆ ప్రాంతాన్ని తమ ఆధీనంలోకి తీసుకుని దర్యాప్తు ప్రారంభించాయి. విస్తీర్ణంలో పాకిస్థాన్‌లోనే అతిపెద్ద ప్రావిన్స్ అయినప్పటికీ, బలూచిస్థాన్ అభివృద్ధిలో చాలా వెనుకబడి ఉంది. ఈ ప్రావిన్స్‌లోని సహజ వనరులను కేంద్ర ప్రభుత్వం దోచుకుంటోందని, స్థానిక ప్రజలకు ప్రయోజనాలు కల్పించడం లేదని బలూచ్ వేర్పాటువాద గ్రూపులు చాలాకాలంగా ఆరోపిస్తున్నాయి.

## హర్మూజ్ జలసంధి తెరుస్తాం.. ఆంక్షలు ఎత్తివేయండి:
## అమెరికాతో ఇరాన్ డీల్?

అంతర్జాతీయంగా తీవ్ర ఉద్రిక్తతలకు దారితీసిన అమెరికా, ఇరాన్ మధ్య వివాదానికి తెరపడే సూచనలు కనిపిస్తున్నాయి. ఇరు దేశాలు 60 రోజుల కాల్పుల విరమణ ఒప్పందం కుదుర్చుకోవడానికి దగ్గరగా ఉన్నాయని, దీనికి సంబంధించిన చర్చలు తుది దశకు చేరుకున్నాయని తెలుస్తోంది. ఈ ఒప్పందంలో భాగంగా ఇరాన్ తన చమురును అమ్ముకోవడానికి అనుమతించడం, కీలకమైన హర్మూజ్ జలసంధిని తిరిగి తెరవడం, వివాదాస్పద అణు కార్యక్రమాన్ని నిలువరించడం వంటి అంశాలు ఉన్నట్లు సమాచారం.

ఆక్సియోస్ (ఊఇఅశీం) కథనం ప్రకారం ఈ 60 రోజుల ఒప్పందంలో భాగంగా హర్మూజ్ జలసంధిని ఎలాంటి సుంకాలు లేకుండా తిరిగి తెరవడానికి ఇరాన్ అంగీకరించింది. నౌకల స్వేచ్ఛా రాకపోకల కోసం అక్కడ ఏర్పాటు చేసిన మైన్‌లను తొలగించనుంది. దీనికి బదులుగా, అమెరికా ఇరాన్ ఓడరేవులపై దిగ్బంధనాన్ని ఎత్తివేయనుంది. ఇరాన్ చమురు అమ్మకాలకు వీలుగా కొన్ని ఆంక్షలను సడలించడంతో పాటు స్తంభింపజేసిన ఇరాన్ నిధులను కూడా విడుదల చేయనుంది. అయితే, ఈ ఒప్పందంలో అత్యంత కీలకమైన ఇరాన్ అణు కార్యక్రమంపై మాత్రం ఇరు దేశాల మధ్య భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అణ్వాయుధాలను తయారు చేయబోమని, యురేనియం శుద్ధిని నిలిపివేస్తామని ఇరాన్ హామీ ఇవ్వాలని ఒప్పంద ముసాయిదాలో ఉన్నట్లు 'ఆక్సియోస్' పేర్కొంది. కానీ, ప్రాథమిక చర్చల్లో అణు కార్యక్రమం అంశం ఉండదని ఇరాన్ అధికారులు స్పష్టం చేస్తున్నారు. ఇరుపక్షాలు ఒక ప్రాథమిక అవగాహనకు వచ్చిన తర్వాతే ఈ క్లిష్టమైన అంశంపై చర్చిస్తారని 'న్యూయార్క్ టైమ్స్' కూడా నివేదించింది. భారత్ పర్యటనలో ఉన్న అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో, ఈ ఒప్పందంపై కొన్ని గంటల్లో ప్రపంచం ఒక శుభవార్త వినే అవకాశం ఉందని ఆదివారం ఢిల్లీలో వ్యాఖ్యానించారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కూడా ఒప్పందం చాలావరకు కొలిక్కి వచ్చిందని, అయితే తుదిరూపు రావాల్సి ఉందని తెలిపారు. మరోవైపు ఇరాన్ విదేశాంగ శాఖ ప్రతినిధి ఇస్మాయిల్ బఖాయీ మాట్లాడుతూ.. అమెరికాతో సానుకూల వాతావరణం ఏర్పడుతు న్నప్పటికీ, కీలక అంశాలపై ఒప్పందం కుదురుతుందని చెప్పలేమన్నారు. ఈ చర్చలకు మధ్యవర్తి త్వం వహించిన పాకిస్థాన్, త్వరలోనే మరో విడత చర్చలు నిర్వహించాలని ఆశిస్తున్నట్లు ప్రధాని షెహబాజ్ షరీఫ్ తెలిపారు. శాంతి చర్చలు జరుగుతున్నప్పటికీ ఒకవేళ అమెరికా మళ్లీ యుద్ధాన్ని ప్రారంభిస్తే ఇదివరకటి కంటే తీవ్రమైన పరిణామాలు ఉంటాయని ఇరాన్ చీఫ్ నెగోషియేటర్ మహమ్మద్ బఘేర్ ఘలీబాఫ్ హెచ్చరించడం ఉద్రిక్తతల తీవ్రతకు అద్దం పడుతోంది.

## జగన్ మళ్లీ సీఎం అవుతారని చంద్రబాబుకు భయం పట్టుకుంది

- మొదటి పేజి తరువాయి


ఏం చేసిందని అంబటి ప్రశ్నించారు. వైసీపీని తిట్టడం తప్ప వీరికి పాలన చేతకావడం లేదన్నారు. రాష్ట్రంలో పంటలకు గిట్టుబాటు ధర లేదని... మొక్కజొన్న ధరలపై ప్రశ్నిస్తే గోడౌన్లపై దాడులు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అంతర్జాతీయ యుద్ధాల నెపంతో పెరిగిన నిత్యావసరాల ధరలను తగ్గించి ప్రజలపై భారం పడకుండా చూసే కనీస ప్రయత్నం కూడా ప్రభుత్వం చేయడం లేదని, చంద్రబాబు, లోకేష్ కలిసి రాష్ట్రాన్ని దోచుకుంటున్నారని అంబటి రాంబాబు ఆరోపించారు.

# బాదంపప్పు బాగోతాలు - 2

- "ఫేక్ ఫ్యామిలీ సర్టిఫికెట్" వెనుక దాగిన చీకటి ఒప్పందం..?
- భార్య పిల్లల హక్కులు మాయం చేసి... చెల్లికి సర్టిఫికెట్ ఎలా..?
- ప్రమాదంలో కుటుంబ పెద్ద మృతి... ఆ తర్వాత మొదలైన అసలు కథ..?
- భార్య పిల్లలను పక్కనబెట్టి చెల్లెలికి ఫ్యామిలీ సర్టిఫికెట్ ఎలా..?
- "బాదంపప్పు" ఒత్తిడితోనే మాన్యువల్ సర్టిఫికెట్ జారీ అయ్యిందా..?
- ఎమ్మార్వో సునీల్ పాత్రపై పెరుగుతున్న అనుమానాలు..?
- రూ.5 లక్షల డీల్ జరిగిందనే ప్రచారం వెనుక నిజమేంటి..?
- చైతన్య, మోహన్, శ్రీను అనే "త్రిమూర్తులు" ఎవరి కోసం పనిచేశారు..?
- బాధిత కుటుంబాన్ని మౌనం పాటించేలా బెదిరింపులు వెళ్లాయా..?
- ఫ్యామిలీ సర్టిఫికెట్ వ్యవహారంపై ఉన్నతాధికారులు విచారణకు ఆదేశిస్తారా..?

**ఓ మధ్యతరగతి కుటుంబ పెద్ద ప్రమాదంలో చనిపోతే... చట్టం ప్రకారం భార్య పిల్లలకు వెళ్లాల్సిన "ఫ్యామిలీ సర్టిఫికెట్"... ఎలా మృతుడి చెల్లెలి చేతికి చేరింది..? తాడేపల్లిగూడెంలో ఇప్పుడు ఇదే హాట్ టాపిక్‌గా మారింది..! "బాదంపప్పు"గా పేరుగాంచిన పోలీస్ అధికారి -- అప్పటి ఎమ్మార్వో సునీల్ -- టౌన్ పోలీస్ స్టేషన్ "త్రిమూర్తులు" కలిసి భారీ స్కెచ్ వేశారనే ఆరోపణలు ఇప్పుడు సంచలనం రేపుతున్నాయి..!**

**ఎడిటర్, పెన్ పవర్ భీమవరం/ తాడేపల్లిగూడెం మే 23:**




తాడేపల్లిగూడెం... సాధారణంగా ప్రశాంతంగా కనిపించే ఈ పట్టణం వెనుక... ఇప్పుడు ఒక్కో కథ బయటకు వస్తుంటే ప్రజలు షాక్ అవుతున్నారు..! ఓ మధ్యతరగతి కుటుంబం... ఓ ప్రమాదం... ఓ దుర్మరణం... ఆ తర్వాత మొదలైన అధికార - పోలీస్ -- మధ్యవర్తుల చీకటి ఆట..! చట్టం ప్రకారం భార్య పిల్లలకు చెందాల్సిన "ఫ్యామిలీ సర్టిఫికెట్"... ఎలా మృతుడి చెల్లెలి చేతికి వెళ్లింది..? దాని వెనుక "బాదంపప్పు"గా పేరుగాంచిన పోలీస్ అధికారి పాత్ర ఏమిటి..? అప్పటి ఎమ్మార్వో సునీల్ ఎందుకు ఇప్పుడు చర్చనీయాంశమయ్యాడు..? ఈ ప్రశ్నలన్నింటికీ సమాధానాలు వెతికే ప్రయత్నమే... "పెన్ పవర్" ప్రత్యేక టీం దర్యాప్తు చేస్తుంది..!

ఉదయం పనికి వెళ్లిన వ్యక్తి... సాయంత్రానికి శవంగా మారాడు..! అది సాధారణ ఉదయం. మధ్యతరగతి కుటుంబానికి పెద్దదిక్కుగా ఉన్న ఓ వ్యక్తి... ప్రతిరోజులానే ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. భార్యకు "వెళ్తా" అన్నాడు... పిల్లల్ని చూసి నవ్వాడు... ఇంకా కొద్దిసేపట్లో తిరిగి వస్తాననుకున్నాడు... కానీ... విధి వేరేలా తీర్పు చెప్పింది. అనుకోని రోడ్డు ప్రమాదంలో ఆ వ్యక్తి ప్రాణాలు కోల్పోయాడు. ఒక్కసారిగా ఆ కుటుంబం చీకట్లో మునిగిపోయింది. భార్య... ఇద్దరు చిన్న పిల్లలు... వారి భవిష్యత్తు ఒక్క క్షణంలో ప్రశ్నార్థకమైంది. ఇక్కడి వరకూ ఒక విషాద కథ... ఆ తర్వాత మొదలైంది అసలు క్రైమ్ స్టోరీ..! సాధారణంగా ఇలాంటి ఘటనల్లో చట్టం ప్రకారం మృతుడి భార్య, పిల్లలకే కుటుంబ హక్కులు వస్తాయి. ఇన్సూరెన్స్, ఆస్తులు, ప్రభుత్వ ప్రయోజనాలు... అన్నింటికీ "ఫ్యామిలీ సర్టిఫికెట్" కీలకం. అయితే... ఈ కేసులో కథ ఒక్కసారిగా మలుపు తిరిగింది. ఎందుకంటే... భార్య పిల్లల పేర్లు ఉండాల్సిన చోట... ఆ సర్టిఫికెట్‌లో మృతుడి చెల్లెలి పేరు ప్రత్యక్షమైందనే సమాచారం ఇప్పుడు సంచలనం రేపుతోంది..! "మాన్యువల్ సర్టిఫికెట్" అనే పదమే ఇప్పుడు అనుమానాలకు కేంద్రం..! సాధారణంగా ఇప్పుడు ఎక్కువగా ఆన్‌లైన్ విధానంలో జారీ అయ్యే ఫ్యామిలీ సర్టిఫికెట్... ఈ కేసులో మాత్రం మాన్యువల్‌గా జారీ అయ్యిందనే ప్రచారం జరుగుతోంది.

**ఇక్కడే అసలు అనుమానాలు మొదలయ్యాయి..:** ఎవరి ఒత్తిడి..? ఎవరి ప్రభావం..? ఎవరి సిఫార్సు..? ఈ ప్రశ్నలన్నింటి మధ్య ఒక్క పేరు మళ్లీ మళ్లీ వినిపిస్తోంది --- "బాదంపప్పు" -- ఎమ్మార్వో సునీల్ మధ్య రహస్య సమన్వయం..? తాడేపల్లిగూడెం పరిధిలో "బాదంపప్పు"గా పేరుగాంచిన ఓ పోలీస్ అధికారి... తన పరిధిని దాటి రెవెన్యూ వ్యవస్థలో కూడా జోక్యం చేసుకున్నాడనే ఆరోపణలు ఇప్పుడు హాట్ టాపిక్ అయ్యాయి. ఈ వ్యవహారంలో అప్పటి ఎమ్మార్వో సునీల్ పేరు కూడా కీలకంగా వినిపిస్తోంది.

స్థానిక వర్గాల సమాచారం ప్రకారం... మృతుడి కుటుంబానికి తెలియకుండానే... కొన్ని రహస్య సమావేశాలు జరిగాయని ప్రచారం. ఎమ్మార్వో కార్యాలయం... పోలీస్ స్టేషన్... మధ్యవర్తుల ఇళ్లలో జరిగిన చర్చల్లో... కొంతమంది కీలక వ్యక్తులు పాల్గొన్నారనే గుసగుసలు వినిపిస్తున్నాయి.

**రూ.5 లక్షల డీల్ జరిగిందా..? :** ఈ వ్యవహారంలో అత్యంత సంచలన అంశం... డబ్బు. ప్రస్తుతం ఢిల్లీ పరిసర ప్రాంతాల్లో పనిచేస్తున్నట్లు చెబుతున్న మృతుడి చెల్లెలి వద్ద నుంచి... అక్షరాల రూ.5 లక్షలు వసూలు చేసినట్లు విశ్వసనీయ సమాచారం బయటకు వస్తోంది.

**ఈ డబ్బు ఎవరి చేతుల్లోకి వెళ్లింది..? :** మధ్యవర్తులు ఎవరు..? ఎవరెవరికి వాటాలు వెళ్లాయి..? అన్నది ఇప్పుడు స్థానికంగా తీవ్ర చర్చకు దారితీసింది.

**"త్రిమూర్తులు" పాత్రపై కొత్త అనుమానాలు..! :** ఈ కేసులో మరో కీలక కోణం కూడా ఇప్పుడు వెలుగులోకి వస్తోందని ప్రచారం. టౌన్ పోలీస్ స్టేషన్‌కు చెందిన కానిస్టేబుళ్లు చైతన్య, మోహన్, శ్రీను అనే "త్రిమూర్తులు" కూడా "బాదంపప్పు"కు బలమైన అండగా నిలిచారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

**బాధితులను స్టేషన్ పేరు చెప్పి భయపెట్టడం... :** "పై నుంచి ఒత్తిడి ఉంది" అంటూ హెచ్చరించడం... సెటిల్మెంట్ చర్చల్లో మధ్యవర్తిత్వం చేయడం... వంటి అంశాల్లో వీరి పేర్లు స్థానికంగా గట్టిగా వినిపిస్తున్నాయి. భార్య పిల్లల కన్నీళ్లపై ఎవరు రాజకీయం ఆడారు..? ఓ కుటుంబం దిక్కు కోల్పోయింది... భార్య భర్తను కోల్పోయింది... పిల్లలు తండ్రిని కోల్పోయారు... అలాంటి సమయంలో వారికి అండగా నిలవాల్సిన వ్యవస్థ... వారికే దూరమైందా..? అధికార ముసుగులో... పోలీస్ ప్రభావంలో... ఓ కుటుంబ హక్కులు కాజేయబడ్డాయా..? అనే ప్రశ్నలు ఇప్పుడు తాడేపల్లిగూడెంలో తీవ్ర చర్చకు దారితీస్తున్నాయి.

**ఉన్నతాధికారులు స్పందిస్తారా..? :** ఇప్పుడు అందరి చూపు ఒక్కటే --- ఈ వ్యవహారంపై ప్రభుత్వం, ఉన్నతాధికారులు స్పందిస్తారా..? మాన్యువల్ ఫ్యామిలీ సర్టిఫికెట్ ఎలా జారీ అయ్యింది..? ఎవరి సిఫార్సుతో జరిగింది..? ఎందుకు భార్య పిల్లలను పక్కనబెట్టారు..? అన్న అంశాలపై సమగ్ర విచారణ జరిపి నిజానిజాలు బయటపెట్టాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

ఇంత జరుగుతున్నా స్టేషన్ హౌస్ ఆఫీసర్ కు తెలియకుండానే జరుగుతున్నాయా... ? స్టేషన్ హౌస్ ఆఫీసర్ రాజకీయ నాయకుల చేతిలో కీలు బొమ్మగా మారిపోయారా...? ఇదే అదును గా చూసుకుని, రూలింగ్ పార్టీ నాయకుల అండదండలతో బాదం పప్పు టౌన్ పోలీస్ స్టేషన్ ను మాఫియా డెన్ గా మార్చడంటే ... అలాగే పై అధికారులను బెదిరించే స్థాయి కి వెళ్లడంటే... ఆ టేబుల్ కింద చేతివాటం మన బాదం పప్పుకు ఎంతుందో... అలాగే కూటమి నాయకుల సపోర్ట్ మన బాదం పప్పు కు ఎంతుందో అర్థం చేసుకోవచ్చు... ఇంత జరుగుతున్నా స్థానిక ఎమ్మెల్యే ఎందుకు నోరు మెదపడం లేదు.. ఆయన ఆంతర్యం ఏమిటీ..?

**ఎపిసోడ్ 12 లో**

**ఏల్లో యూట్యూబర్ల పై కేసులు ఎందుకు తొక్కి పెట్టారు...?**
**ఫోక్సో యాక్ట్ ప్రకారం**
**చట్టంలోని సెక్షన్ 23 ఏం చెబుతుంది... బాధిత మైనర్‌ను గుర్తించే విధంగా సమాచారాన్ని ప్రసారం చేయరాదని స్పష్టం ఉంది, ఈ నిబంధనలు తుంగలో తొక్కి, చట్టాన్ని ఉల్లంఘించి, స్థానిక ఎల్లో యూట్యూబర్లు వారి యూట్యూబ్ లలో ప్రసారం చేయడంతో అప్పటి సీ ఐ సుబ్రహ్మణ్యం సంబంధిత ఎల్లో యూట్యూబర్ల పై ఫోక్సో కేసు నమోదు చేశారు..? ఆ సమయం లోనే సదరు సీ ఐ కి ట్రాన్స్ ఫర్ రావడం తో... ఆ కేసును ఎందుకు నీరు గర్చారు..?**
**ఎవరి ప్రోద్భలం తో ఆ ఫైల్ పక్కన పడేశారు...?**

## జగన్ రక్తచరిత్ర అందరికీ తెలుసు..
## వచ్చే ఎన్నికల్లో వైసీపీకి 'జీరో'నే

- మొదటి పేజి తరువాయి

జిల్లాలో నారాయణ పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు.

గత వైసీపీ హయాంలో సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలకు కేటాయించిన నిధులను ఎందుకు వినియోగించలేదో జగన్ సమాధానం చెప్పాలని నారాయణ డిమాండ్ చేశారు. చివరకు కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన స్వచ్ఛ భారత్ నిధులను కూడా జగన్ సర్కార్ దారి మళ్లించిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ నేతృత్వంలో కూటమి ప్రభుత్వం అత్యంత పారదర్శకంగా డీఎస్సీ పరీక్షలను నిర్వహించి, ఎలాంటి అవినీతి లేకుండా నిజాయతీగా ఉద్యోగాలను కేటాయించిందని స్పష్టం చేశారు. ఇంత మంచి జరుగుతుంటే ఉద్దేశపూర్వకంగానే ప్రభుత్వంపై జగన్ అండ్ కో అవాస్తవాలు ప్రచారం చేస్తున్నారని దుయ్యబట్టారు. తెలుగుదేశం పార్టీ ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించే 'మహానాడు' వేడుకలకు ఏర్పాట్లు జరుగుతున్నాయని మంత్రి వెల్లడించారు. ఈసారి హైబ్రిడ్ విధానంలో (ప్రత్యక్షంగా, వర్చువల్ గా) మహానాడు ఉంటుందని... గతంలో మాదిరే రాజకీయ తీర్మానాలు, ఆమోదాలు ఉంటాయని తెలిపారు. ముఖ్యంగా పార్టీ కోసం కష్టపడిన కార్యకర్తలకు ఈ వేదికపై మాట్లాడే పూర్తి అవకాశం కల్పిస్తామన్నారు. తన పర్యటనలో భాగంగా నెల్లూరు పరమేశ్వరనగర్ వక్ఫ్ బోర్డు స్థలంలో నిర్మిస్తున్న మున్సిపల్ కార్పొరేట్ స్కూల్ ప్రాంతాన్ని నారాయణ సందర్శించారు. సామాన్య ముస్లిం విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్యను అందించడమే ధ్యేయంగా, స్విమ్మింగ్ పూల్‌తో సహా అన్ని రకాల ఆధునిక వసతులతో ఈ పాఠశాలను నిర్మిస్తున్నట్లు ఆయన తెలిపారు. దాతల సహకారంతో నగరంలోని పలు మున్సిపల్ స్కూళ్లను కార్పొరేట్ స్థాయికి మారుస్తున్నామని, అలాగే ఏపీలోని 123 మున్సిపాలిటీల్లో రూ. 1,400 కోట్లతో డ్రైనేజీ పనులు శరవేగంగా జరుగుతున్నాయని మంత్రి నారాయణ వివరించారు. మంత్రి పర్యటనలో వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్, నెల్లూరు మేయర్ సుజాత తదితరులు పాల్గొన్నారు.

## విజయ్ గెలుపు ఒక 'సినిమా సునామీ'..
## ఆ ప్రభుత్వం ఎప్పుడైనా కూలిపోవచ్చు

తమిళనాడు రాజకీయాల్లో అసెంబ్లీ ఎన్నికల ఫలితాల తర్వాత సరికొత్త యుద్ధం మొదలైంది. డీఎంకే అధినేత, మాజీ సీఎం ఎం.కె.స్టాలిన్ ప్రస్తుత ముఖ్యమంత్రి విజయ్ నేతృత్వంలోని టీవీకే ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. చెన్నైలో జరిగిన పార్టీ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ... ప్రస్తుతం అధికారంలో ఉన్న విజయ్ ప్రభుత్వం ఐదేళ్లపాటు పూర్తి కాలం కొనసాగలేదని, అది డీఎంకే దయాదాక్షిణ్యాలపైనే నడుస్తోందంటూ సంచలన వ్యాఖ్యలు చేశారు. తమిళనాడు ఎన్నికల ఫలితాలను ఒక రాజకీయ ప్రభంజనంగా తాను భావించడం లేదని, ఇదొక 'సినిమా సునామీ' మాత్రమేనని స్టాలిన్ అభివర్ణించారు. ఓటర్లు ఎలాంటి రాజకీయ విశ్వాసం లేదా సిద్ధాంతాలను చూసి టీవీకే పార్టీకి ఓటు వేయలేదని, కేవలం ఒక ప్రముఖ స్టార్ నటుడు పార్టీ పెట్టాడనే ఉత్సాహంతోనే విజయ్‌కు మద్దతు తెలిపారని అన్నారు. పిల్లలకు కొత్తగా ఆడుకునేందుకు ఒక ఆటవస్తువు దొరికితే ఎంత ఉత్సాహం చూపిస్తారో, ఇదీ అలాంటిదేనని... కొన్ని రోజుల్లోనే ఆ ఆటవస్తువుపై ప్రజలకు ఆసక్తి తగ్గిపోతుందని వ్యాఖ్యానించారు. ఒక బిడ్డ తన తల్లి కోసం వెతికినట్టు, తమిళనాడు ఓటర్లు త్వరలోనే మళ్లీ డీఎంకే కోసం వెతకడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మేజిక్ ఫిగర్ అంశాన్ని స్టాలిన్ ప్రధానంగా ప్రస్తావించారు. టీవీకే పార్టీ సొంతంగా

మేజిక్ ఫిగర్ అయిన 118 సీట్ల మార్కును దాటడంలో పూర్తిగా విఫలమైందని గుర్తుచేశారు. కనీస మెజారిటీ కూడా సాధించలేకపోయిన ఆ ప్రభుత్వం, ఈ రోజు డీఎంకే కూటమిలోని పార్టీల మద్దతు వల్లే మనుగడ సాగిస్తోందని, ఏ క్షణమైనా ఈ ప్రభుత్వం కూలిపోవచ్చని హెచ్చరించారు. డీఎంకేను చీల్చేందుకు తెరవెనుక తీవ్ర ప్రయత్నాలు జరిగాయని, కానీ అవి విఫలమయ్యాయని చెప్పారు. కమ్యూనిస్ట్ పార్టీలు, వీసీకే, ఐయూఎంఎల్ వంటి పార్టీలు మొదట టీవీకే ప్రభుత్వానికి బయటి నుంచి మాత్రమే మద్దతు ఇస్తామని చెప్పి, ఆ తర్వాత క్యాబినెట్‌లో చేరడాన్ని ఆయన తప్పుపట్టారు. రాష్ట్రంలో ప్రస్తుత రాజకీయ పరిస్థితి అత్యంత అస్థిరంగా ఉందని వ్యాఖ్యానించారు.

## మూర్ఖులు ఎక్కడైనా ఉంటారు

భారత పర్యటనలో ఉన్న అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో, భారత విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్‌తో కలిసి న్యూఢిల్లీలో నిర్వహించిన సంయుక్త మీడియా సమావేశంలో పలు విషయాలను పంచుకున్నారు.

అమెరికాలో భారతీయులపై జరుగుతున్న జాత్యహంకార దాడులపై రూబియో స్పందించారు. అమెరికా సమాజంలోని జాత్యహంకారమే ఈ దాడులకు కారణమనే వాదనను తోసిపుచ్చారు. "ప్రపంచంలోని ప్రతి దేశంలోనూ మూర్ఖులు ఉంటారు, కొన్ని సంఘటనల ఆధారంగా మొత్తం దేశాన్ని అంచనా వేయలేము" అని వ్యాఖ్యానించారు. అమెరికాలో భారతీయ సమాజం అత్యంత విజయవంతమైన, గౌరవప్రదమైన సమాజంగా ఉందని, వ్యాపారం, సాంకేతికత, వైద్య రంగాల్లో అద్భుతంగా రాణిస్తోందని కొనియాడారు. మరోవైపు, ఇరాన్‌తో శాంతి ఒప్పందానికి సంబంధించి రాబోయే కొన్ని గంటల్లో ప్రపంచానికి ఒక శుభవార్త అందే అవకాశం ఉందని రూబియో వెల్లడించారు. అమెరికా-ఇజ్రాయెల్ సంయుక్త దాడికి ప్రతిస్పందనగా ఇరాన్ చాలా వరకు దిగ్బంధించిన హోర్ముజ్ జలసంధిపై ఉన్న ఆందోళనలను ఈ కుదురుతున్న శాంతి ఒప్పందం పరిష్కరిస్తుంద న్నారు. ఇరాన్ అణ్వాయుధం గురించి ఇకపై భయపడాల్సిన అవసరం లేని ప్రపంచంలోకి మనం అడుగుపెట్టబోతున్నామని చెప్పారు. డొనాల్డ్ ట్రంప్ కూడా ఇరాన్‌తో శాంతి చర్చలపై పాజిటివ్ పోస్ట్ చేసిన నేపథ్యంలో రూబియో వ్యాఖ్యలు ప్రపంచవ్యాప్తంగా తీవ్ర ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి.

## కర్ణాటకలో విషాదం... ఆల్చిప్పల కోసం
## నదిలో దిగి 8 మంది మృతి

కర్ణాటకలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. ఉత్తర కన్నడ జిల్లా భట్కళ్ తాలూకాలోని వెంకటాపుర నదిలో ముత్యపు చిప్పలు సేకరించేందుకు వెళ్లిన 14 మందిలో 8 మంది నీటిలో కొట్టుకుపోయి ప్రాణాలు కోల్పోయారు. మరో ముగ్గురి ఆచూకీ లభించకపోవడంతో గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి. ఈ ఘటనలో ముగ్గురిని సురక్షితంగా కాపాడారు.

వివరాల్లోకి వెళ్తే, శిరాలి ప్రాంతంలోని పడుశిరాలి గ్రామానికి చెందిన ఒకే కుటుంబానికి చెందిన 14 మంది ఆదివారం వెంకటాపుర నదిలో ముత్యపు చిప్పలు (ఆల్చిప్పలు) సేకరించేందుకు వెళ్లారు. ఇటీవల కురిసిన వర్షాలకు నదిలో నీటి ప్రవాహం ఒక్కసారిగా పెరగడంతో వారు అదుపుతప్పి కొట్టుకుపోయారు. సమాచారం అందుకున్న వెంటనే స్థానికులు, భట్కళ్ గ్రామీణ పోలీసులు, సహాయక బృందాలు రంగంలోకి దిగాయి.

ఈ దుర్ఘటనలో మరణించినవారిని లక్ష్మీ మహాదేవ నాయక్ (38), లక్ష్మీ శివరామ్ నాయక్ (39), ఉమేష్ మంజునాథ్ నాయక్ (42), మస్తమ్మ మంజునాథ్ నాయక్ (43), లక్ష్మీ అన్నప్ప నాయక్ (44), జ్యోతి నాగప్ప నాయక్ (37), మాలతి జట్టప్ప నాయక్ (38)గా గుర్తించారు. మరొకరి వివరాలు తెలియాల్సి ఉంది. వీరి మృతదేహాలను వెలికితీసి భట్కళ్, మురుడేశ్వర్‌లోని ఆసుపత్రులకు తరలించారు. మరో ముగ్గురు మాదేవ జట్టప్ప నాయక్ (52), మంజమ్మ గొట్ట నాయక్ (50), నాగరత్న పరమేశ్వర్ నాయక్ (40) కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయి. గాయపడిన ఇద్దరు మహిళలను మెరుగైన చికిత్స కోసం ఉడుపిలోని ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. మృతుల కుటుంబాలకు రూ. 5 లక్షల చొప్పున పరిహారం అందిస్తామని సీఎం సిద్ధరామయ్య ప్రకటించారు. సహాయక చర్యలు ముమ్మరంగా కొనసాగుతున్నాయని అధికారులు తెలిపారు.

పెన్ పవర్
MARKAPURAM మార్కాపురం
మార్కాపురం - ప్రకాశం



# ఒకే నెలలో మూడోసారి

# పెట్రో సెగ

## -సామాన్యుడిపై మరింత ఆర్థిక భారం

## -రవాణా ఖర్చులు పెరిగే అవకాశం

**బ్యూరో పెన్ పవర్, ప్రకాశం మే 24**

దేశవ్యాప్తంగా పెట్రోల్, డీజిల్ ధరలు మరోసారి పెరగడంతో సామాన్య ప్రజలపై అదనపు భారం పడింది. మే 23 ఉదయం 6 గంటల నుంచి అమల్లోకి వచ్చిన తాజా ధరల ప్రకారం పెట్రోల్పై లీటర్ కు 87 పైసలు, డీజిల్పై 91 పైసలు పెరిగాయి. ఈ నెలలోనే ఇది మూడోసారి ధరల పెంపు కావడం గమనార్హం. ఇప్పటికే నిత్యావసరాల ధరల పెరుగుదలతో ఇబ్బందులు పడుతున్న ప్రజలకు ఈ తాజా పెంపు మరింత ఆందోళన కలిగిస్తోంది.ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు ప్రతిరోజూ అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు ధరలు, రూపాయి-డాలర్ మారకం విలువ, దిగుమతి వ్యయాలు, రవాణా ఖర్చులు వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని ధర లను సవరిస్తుంటాయి. ఈ నేపథ్యంలో గ్లోబల్ మార్కెట్లో క్రూడ్ ఆయిల్ ధరలు పెరగడం, డాలర్తో పోలిస్తే రూపాయి బలహీనపడటం వల్ల తాజా పెంపు తప్పలేదని చమురు సంస్థలు పేర్కొంటున్నాయి. తాజా పెంపుతో ఆంధ్రప్రదేశ్లో పెట్రోల్ సగటు ధర లీటర్ కు సుమారు ...113.70కు చేరుకోగా, డీజిల్ ధర ...101.40 వరకు నమోదైంది. జిల్లాల వారీగా స్వల్ప తేడాలు ఉన్నప్పటికీ రాష్ట్రవ్యాప్తంగా ధరలు భారీగానే ఉన్నాయి. మే నెల ప్రారంభం నుంచి ఇప్పటివరకు పెట్రోల్ ధరల్లో వరుసపెరుగుదల కనిపిస్తోంది. మే 14న పెట్రోల్ ధర సుమారు...109.61 ఉండగా, మే 21 నాటికి అది ...113.28కు చేరింది. తాజాగా మరో 87 పైసల నెల పెంపుతో మొత్తం నెలలోనే లీటరుకు దాదాపు ...4 వరకు పెరిగినట్లైంది. డీజిల్ ధరలు కూడా ఇదే విధంగా పెరగడం వల్ల రవాణా రంగంపై తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉందని ఆర్థిక నిపుణులు చెబుతున్నారు. ఇంధన ధరల పెరుగుదల ప్రభావం కేవలం వాహనదారులకే పరిమితం కాదు. డీజిల్ ధరలు పెరగడంతో సరుకు రవాణా ఖర్చులు అధికమవుతాయి. దాని ప్రభావం కూరగాయలు, పండ్లు, ధాన్యాలు, నిర్మాణ సామగ్రి తదితర వస్తువుల ధరలపై పడుతుంది.ఇప్పటికే వేసవి కాలంలో పెరిగిన ఖర్చులతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రజలకు ఈ పెంపు మరింత భారంగా మారనుంది. ముఖ్యంగా రోజువారీగా ద్విచక్ర వాహనాలు వినియోగించే ఉద్యోగులు, చిన్న వ్యాపారులు, ఆటో డ్రైవర్లు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఆంధ్రప్రదేశ్లో ఇతర రాష్ట్రాలతో పోలిస్తే ఇంధన ధరలు అధికంగా ఉండటానికి ప్రధాన కారణం రాష్ట్ర ప్రభుత్వం విధిస్తున్న వ్యాట్ పన్నులేనని నిపుణులు చెబుతున్నారు. ఉదాహరణకు దేశ రాజధాని ఢిల్లీలో పెట్రోల్ ధర సుమారు ...98.64 వద్ద ఉండగా, ఆంధ్రప్రదేశ్లో అది ...113 దాటింది. అంటే లీటరుకు దాదాపు ...15 వరకు తేడా కనిపిస్తోంది. రాష్ట్రంలో వ్యాట్ తగ్గిస్తే ప్రజలకు కొంత ఊరట లభిస్తుందని వాహనదారులు అభిప్రాయ పడుతున్నారు. ఇటీవల కాలంలో పెరుగుతున్న అంతర్జాతీయ ఉద్రిక్తతలు, ముడిచమురు ఉత్పత్తి దేశాల విధాన మార్పులు కూడా ధరల పెరుగుదలకు కారణమవుతున్నాయి. అంతర్జాతీయ మార్కెట్లో క్రూడ్ ఆయిల్ ధరలు స్థిరపడకపోతే వచ్చే రోజుల్లో మరిన్ని పెంపులు ఉండొచ్చనే ఆందోళన వ్యక్తమవుతోంది. అయితే ప్రపంచ మార్కెట్ పరిస్థితులను నిరంతరం సమీక్షిస్తున్నామని, అవసరమైనప్పుడు ధరల్లో మార్పులు చేస్తామని ఆయిల్ కంపెనీలు చెబుతున్నాయి. ఇంధన ధరల పెరుగుదల నేపథ్యంలో ప్రజలు ఖర్చులను నియంత్రించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. కొంతమంది వాహనదారులు ప్రయాణాలను తగ్గించుకోవడం, పబ్లిక్ ట్రాన్స్పోర్ట్ వినియోగం పెంచుకోవడం వంటి మార్గాలను అనుసరిస్తున్నారు. మరోవైపు ఎలక్ట్రిక్ వాహనాలపై ఆసక్తి కూడా పెరుగుతోంది. భవిష్యత్తులో ఇంధన ధరలు మరింత పెరిగే అవకాశాలు ఉండటంతో ప్రత్యామ్నాయ ఇంధన వనరులపై దృష్టి సారించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



# బడి బస్సులు భద్రమేనా..?

### అధికారుల తనిఖీలు నిబంధనలకే పరిమితమా?

### ఫిట్నెస్ సర్టిఫికెట్లు ఉన్నా... భద్రతపై అనుమానాలే!

### విద్యార్థుల ప్రాణాలతో చెలగాటమాడుతున్న ప్రైవేట్ విద్యాసంస్థలు?

**బ్యూరో పెన్ పవర్, ప్రకాశం మే 24**

కొత్త విద్యాసంవత్సరం ప్రారంభం సమీపిస్తుడంతో విద్యార్థులను పాఠశాలలకు తరలిస్తున్న బడి బస్సుల భద్రతపై తల్లిదండ్రుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. నిబంధనల ప్రకారం పాఠశాల బస్సులకు ప్రతి ఏడాది ఫిట్నెస్ సర్టిఫికెట్, అగ్నిమాపక పరికరాలు, ఫస్ట్ఎయిడ్ బాక్స్, అత్యవసర ద్వారాలు, జీపీఎస్ ట్రాకింగ్ వ్యవస్థ, సీసీ కెమెరాలు, స్పీడ్ గవర్నర్, మహిళా అటెండర్ వంటి భద్రతా ప్రమాణాలు తప్పనిసరి. అయితే చాలా బస్సుల్లో ఇవి కేవలం కాగితాలకే పరిమితమయ్యాయనే విమర్శలు వినిపిస్తున్నాయి. కందుకూరు పరిసర ప్రాంతాల్లో నడుస్తున్న కొన్ని ప్రైవేట్ పాఠశాల బస్సులు పాతవి, శిథిలావస్థలో ఉన్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. కొన్నింటిలో కిటికీలకు సరైన రక్షణ లేకపోవడం, సీట్లు దెబ్బతినడం, టైర్లు అరిగిపోవడం, ఎమర్జెన్సీ డోర్లు పని చేయకపోవడం వంటి లోపాలు కనిపిస్తున్నాయని చెబుతున్నారు. అయినప్పటికీ ఇవే బస్సులు ప్రతిరోజూ వందలాది మంది చిన్నారులను తరలిస్తున్నాయి. అధికారులు తరచూ తనిఖీలు చేస్తున్నామని చెబుతున్నప్పటికీ, వాస్తవ పరిస్థితి భిన్నంగా ఉందని తల్లిదండ్రులు వాపోతున్నారు. తనిఖీలు కేవలం పేరుకే జరుగుతున్నాయా? లేక నిజంగా ప్రతి బస్సు ఫిట్నెస్ను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారా? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. కొన్ని బస్సులు ఫిట్నెస్ గడువు ముగిసినా రోడ్లపైకి వస్తున్నాయనే ఆరోపణలు ఉన్నాయి. అధిక సంఖ్యలో విద్యార్థులను ఎక్కించడం కూడా మరో ప్రధాన సమస్యగా మారింది. సామర్థ్యానికి మించి పిల్లలను కూర్చోబెట్టడం, కొన్నిసార్లు నిలబెట్టి తరలించడం వల్ల ప్రమాదం సంభవించే అవకాశం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. డ్రైవర్ల అజాగ్రత్త, వేగంగా నడపడం, మొబైల్ ఫోన్ వినియోగం వంటి అంశాలు ప్రమాద అవకాశాలను మరింత పెంచుతున్నాయి. పిల్లల భద్రత విషయంలో రాజీ ఉండకూడదని తల్లిదండ్రులు స్పష్టం చేస్తున్నారు. సంబంధిత రవాణా శాఖ, విద్యాశాఖ అధికారులు సంయుక్తంగా ఆకస్మిక తనిఖీలు నిర్వహించి నిబంధనలు పాటించని పాఠశాల యాజమాన్యాలపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. బడి బస్సు ఎక్కిన ప్రతి చిన్నారి క్షేమంగా ఇంటికి చేరడం అధికారుల బాధ్యత. ఇకనైనా కఠిన చర్యలు తీసుకుని విద్యార్థుల భద్రతకు భరోసా కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

# నారాయణస్వామికి భక్తి శ్రద్ధలతో పూజలు





**సి ఎస్ పురం, పెన్ పవర్ మే 24**

జిల్లాలో ప్రసిద్ధి చెందిన పుణ్యక్షేత్రంగా పేరొందిన మిట్టపాలెం నారాయణస్వామి దేవస్థానంలో స్వామి వారికి ఆదివారం ప్రీతికరమైన రోజు కావడంతో తెల్ల వారుజాము నుంచే భక్తులు తరలివచ్చి భక్తిశ్రద్ధలతో పూజా కార్యక్రమాలలో పాల్గొన్నారు. ఆలయ కార్య నిర్వహణ అధికారి గిరిరాజు నరసింహ బాబు, ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త కొమ్మినేని చిన్న ఆదినారా యణ సూచనలతో అర్చకులు మంకాల శివప్రసాద్ శర్మ ఆధ్వర్యంలో నారాయణస్వామికి ప్రత్యేక అభిషేక పూజ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు అర్చకులు స్వామివారికి సంప్రదాయ ప్రకారం అభిషేక పూజలు నిర్వహించారు. స్వామివారి మూలవిరాట్, శ్రీదేవి భూదేవి సమేత విష్ణుమూర్తి ఉత్సవమూర్తులను పట్టు వస్త్రాలతో పూలమాలలతో అలంకరించారు అనం తరం గోపూజ కార్యక్రమంలో భాగంగా గోశాల వద్ద గోవును పవిత్రంగా అలంకరించి వేదమంత్రాలతో పూజలు నిర్వహించారు తదుపరి దేవస్థానం చుట్టూ ప్రదక్షణలు నిర్వహించి స్వామివారికి మహా నైవేద్యం సమర్పించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు అనంతరం అన్న ప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు ఈ కార్యక్రమాలలో నల్లమడుగుల గ్రామానికి చెందిన ముడిమాల నారాయణరెడ్డి , పోకల మాల్యాద్రి, ఆలయ సిబ్బంది, ఆలయ అర్చకులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# అనారోగ్యంతో బాధపడే పేదలకు ఆపన్నాహస్తం

### ముఖ్యమంత్రి సహాయనిధ

### టీడీపీ కార్యాలయంలో ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కుల పంపిణీ

### ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి

**గిద్దలూరు పెన్ పవర్ మే 24**


అనారోగ్యంతో బాధపడుతున్న పేద కుటుంబాలకు గిద్దలూరు శాసనసభ్యులు ముత్తుముల అశోక్ రెడ్డి కొండంత అండగా నిలుస్తున్నారు. ఆదివారం ఉదయం గిద్దలూరు పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ముఖ్యమంత్రి సహాయ నిధి కింద మంజూరైన 19వ విడత చెక్కులను లబ్ధిదారులకు ఎమ్మెల్యే స్వహస్తాలతో పంపిణీ చేశారు. ఈ విడతలో మొత్తం 25 మంది లబ్ధిదారులకు రూ. 22,23,540/- లక్షలవిలువైన చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీ ముత్తుముల అశోక్ రెడ్డి మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వ పాలనలో, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సహకారంతో పేద ప్రజలు కూడా ధైర్యంగా కార్పొరేట్ వైద్యం చేయించుకోవచ్చనే భరోసాను కల్పిస్తున్నామన్నారు. ఆర్థిక స్థోమత లేక వైద్యానికి దూరం కాకూడదనే ఉద్దేశంతోనే ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా నిరంతరం ఆర్థిక సాయం అందజేస్తున్నట్లు తెలిపారు.





పేదలకు నాణ్యమైన ఆరోగ్యాన్ని అందించడమే లక్ష్యంగా కూటమి పాలన సాగుతోందని, భవిష్యత్ కాలంలో అనారోగ్యం రహిత ఆంధ్రప్రదేశ్ను రూపొందించడమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని ఆయన స్పష్టం చేశారు. గిద్దలూరు నియోజకవర్గంలో ఇప్పటివరకు 1068 మంది లబ్ధిదారులకు రూ. 8,89,99,433 /-లు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా అందించటం జరిగిందని, మరియు ప్రమాద భీమా ద్వారా 4 కుటుంబాలకు రూ. 20 లక్షలు అందచేశామని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి పార్టీల ముఖ్య నాయకులు, కార్యకర్తలు లబ్ధిదారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కష్టకాలంలో తమకు కొండంత అండగా నిలిచిన ముఖ్యమంత్రి కి, ఎమ్మెల్యే అశోక్ రెడ్డి కి లబ్ధిదారులు, వారి కుటుంబ సభ్యులు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు.

# నారాయణస్వామి ప్రత్యేక పూజల్లో పాల్గొన్న ఈవో గిరిరాజు నరసింహబాబు



**సి ఎస్ పురం, పెన్ పవర్ మే 24**

జిల్లాలో ప్రసిద్ధిగాంచిన ప్రముఖ పుణ్యక్షేత్రమైన మిట్టపాలెం నారాయణ స్వామిని ఈవో గిరిరాజు నరసింహబాబు ఆదివారం దర్శించుకుని ప్రత్యేక పూజా కార్యక్రమాలలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయానికి విచ్చేసిన భక్తుల క్యూలైన్ సదుపాయాలను పరిశీలించి ఆలయ సిబ్బందికి పలు సూచనలు చేశారు అనంతరం ఆలయంలో నారాయణస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద మంత్రోచ్చారణల నడుమ ఆలయ అర్చకులు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించగా, ఈవో గిరిరాజు నరసింహబాబు భక్తిశ్రద్ధలతో స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

# సీఐ సురేష్ ఆధ్వర్యంలో విస్తృత తనిఖీలు



**గిద్దలూరు పెన్ పవర్ మే 24**

గిద్దలూరు మండలం పరిసర ప్రాంతాలలో గిద్దలూరు అర్బన్ సిఐ సురేష్ శనివారం రాత్రంతా విస్తృత తనిఖీలు నిర్వహించారు. జిల్లాలో చెడ్డి గ్యాంగ్ కదలికలు దొంగతనాలు జరుగుతున్న నేపథ్యంలో ఎస్పీ హర్షవర్ధన్ రాజు జిల్లా పోలీసులు యంత్రాంగాన్ని అప్రమత్తం చేశారు. అందులో భాగంగా గిద్దలూరు రైల్వే స్టేషన్ తో పాటు, లాడ్జిలు, నిర్మానుష ప్రదేశాలు, నల్లబండ బజార్, ముండ్లపాడు పరిసర ప్రాంతాలను తనిఖీ చేశారు. ఊరి బయట నివసిస్తున్న వ్యక్తులను పరిశీలించడమే కాకుండా అనుమానిత వ్యక్తులను ప్రశ్నించి వారి వివరాల సేకరించారు. ఎవరన్నా అనుమానిత అనుమానస్పద వ్యక్తులను గుర్తిస్తే వెంటనే 100,లేదా 112 నంబర్లకు ఫోన్ చేసి సమాచారం అందించాలని సీఐ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. వేసవి సెలవులకు ఇతర ప్రాంతాలకు వెళ్లే ప్రజలు ఇంటిలో విలువైన బంగారు ఇతర వస్తువులను నగదును ఉంచకుండా బంధువుల ఇళ్లల్లో కానీ బ్యాంకు లాకర్ లో కానీ భద్రపరుచుకోవాలని సూచించారు. ఈ తనిఖీలలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# మాలకొండయ్యకు ఆర్థిక సహాయం అందజేసిన దద్దాల



**పీసీపల్లి, పెన్ పవర్ మే 24**

నేరేడుపల్లి పంచాయతీలోని వైకాపా పార్టీ కార్యకర్త కొడవలూరి మాలకొండయ్య ఇటీవల గుండెకు బైపాస్ సర్జరీ చేయించుకుని ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్నారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్సీపీ కనిగిరి నియోజకవర్గం ఇంచార్జి దద్దాల నారాయణ యాదవ్ మండల పార్టీ శ్రేణులతో కలిసి ఆదివారం మాలకొండయ్య ను పరామర్శించారు. రూ.10,000 ఆర్థికసాయం అందజేసి వారి కుటుంబానికి అండగా ఉంటానని భరోసా కల్పించారు. ఈ సందర్భంగా సర్జరీ సంబందించిన వివరాలు అడిగి తెలుసుకొని, పలు జాగ్రత్తలు సూచించి,త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో గోపవరపు బొర్రారెడ్డి,ఓకే రెడ్డి,గాండ్లపర్తి ఆదినారాయణ రెడ్డి,యర్రంరెడ్డి మోహన్ రెడ్డి,గుజ్జుల బాల నర్సారెడ్డి,బోడే కొండారెడ్డి,పులి రవిరెడ్డి, మూలే రాజశేఖర్ రెడ్డి,భూమిరెడ్డి కొండారెడ్డి,పాతకొట్టు పిచ్చిరెడ్డి,బోడే మల్లికార్జునరెడ్డి, బోరెడ్డి బ్రహ్మారెడ్డి,తిరుమలపూడి మహేష్,వెన్నం దివ్య,చవడం శ్రీనువాసులు,సంగని మల్లికార్జున,బోరెడ్డి మాలకోట రెడ్డి,గుడిమెట్ల నాగార్జున, అంద్ర వెంకటరావు,ప్రసాద్, గణేశుని శ్రీనివాసుల రెడ్డి, బోడే శివారెడ్డి,బోరెడ్డి ఓబుల్ రెడ్డి,చవడం మాలకొండయ్య,గణేశుని చెన్నకేశవులు తదితరులు పాల్గొన్నారు.

# కనకదుర్గమ్మ అమ్మవారిని దర్శించుకున్న సంగరాజు సాయి మనోజ్





**సి ఎస్ పురం, పెన్ పవర్ మే 24**

విజయవాడ పట్టణంలోని ఇంద్రకీలాద్రి పై వెలసియున్న కనకదుర్గమ్మ అమ్మవారిని ఆదివారం కుటుంబ సమేతంగా జాతీయ బ్రాహ్మణ యువజన కార్యదర్శి సంగరాజు సాయి మనోజ్ దర్శించుకుని ప్రత్యేక పూజా కార్యక్రమాలలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆలయ అర్చకులు వేదమంత్రోచ్ఛారణల నడుమ గోత్రనామాలతో ప్రత్యేక ఆశీర్వచనాలు అందజేశారు. అనంతరం దేవస్థానం తరఫున శేష వస్త్రాలతో సత్కరించి అమ్మవారి తీర్థప్రసాదాలను అందించారు. ఈ కార్యక్రమంలో వెంకటకృష్ణమూర్తి, వేణుగోపాల్ అంబరీష్ తదితరులు పాల్గొన్నారు.

# అతను ఓ నిరుద్యోగి ..వంట మాస్టర్ పనిచేస్తున్నాడు

## 4 గురికి ఉపాధి మార్గం చూపిస్తున్నాడు -ఇంటర్ ఐటిఐ పూర్తి చేశాడు

## వంట మాస్టర్ గా పలువురికి ఆదర్శంగా మారాడు -జీవనాధారం సంతృప్తిగా ఉందని తెలిపిన షేక్ రసూల్

**పెన్ పవర్, కంభం మే 24**


నిరుద్యోగ సమస్యకు సరైన శిక్షణ నైపుణ్యం మరియు పట్టుదలతో చక్కటి పరిష్కారం లభిస్తుంది. చాలామంది నిరుద్యోగి గా బాధపడుతూ ఎంతోమంది తమ ఆవేదన బాధను వ్యక్తం చేస్తుంటారు. కానీ వంట రంగంలో శిక్షణ పొంది స్వయం ఉపాధి ద్వారా విజయవంతమైన వంట మాస్టర్ గా షేక్. రసూల్ రాణిస్తున్నారు. కంభం పట్టణం కోనేటి వీధికి చెందిన షేక్. రసూల్ దమ్ బిర్యాని చికెన్ మటన్ వంట చేయడంలో పరిమళ భరతమైన రుచికరమైన బిర్యాని తయారు చేస్తూ పలువురికి ఆదర్శంగా మారాడు. కొంతమంది పేదవారిని అనుసరిస్తూ వారు ఇచ్చిన కాడికే తీసుకుంటూ మంచి పేరు తెచ్చుకుంటూ ఉన్నాడు. కంభం పట్టణంతోపాటు పరిసర గ్రామాలు ఇతర మండలాలలో కూడా తమ ఆర్డర్లను భట్టి ప్రత్యేకంగా వెళుతుంటాడు. ఒకవైపు రీజనబుల్ రేట్లు పొందుతూ పలువురికి ఆదర్శంగా పేరు పొందడం గమనార్హం. నోరూరించే దమ్ వెజ్ బిర్యానీ చికెన్ మటన్ ఎన్నో రకాలు చేయడంలో మంచి శిక్షణ పొందడం జరిగింది. ముందుగానే ఆర్డర్లు ఇచ్చే వారికి బిర్యానీకి ఉపయోగించడానికి ఉత్తమమైన బియ్యం, పొడవైన సుగంధ బాస్మతి మాంసం లాంటివి కావాలని చెప్తాడు. అన్ని రకాల బిర్యానీలు తయారు చేయడంలో ప్రత్యేకత సంపాదించుకున్నాడు. వెజిటేరియన్ నాన్ వెజిటేరియన్ కూడా చేయడంలో ఇతను ప్రత్యేక నైపుణ్యత పొందడం జరిగింది. నిరుద్యోగ సమస్యతో ఎదురు చూడకుండా నలుగురికి ఉపాధి కలిగిస్తూ వంట రంగంలో నైపుణ్యం ఉంటే జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగవచ్చని ఆ వంట మాస్టర్ పేర్కొన్నారు .వంట మాస్టర్ గా ఎదగడానికి ప్రతి నిరుద్యోగికి సొంత ఉపాధి ఉంటుందని అతను ఆదర్శంగా చూపిస్తున్నాడు. కుటుంబ పోషణలో ఎలాంటి ఇబ్బందులు కూడా ఉండవని వంట మాస్టర్ పేర్కొన్నాడు.





# పెద్దారవీడులో ఉచిత కంటి వైద్య శిబిరం ప్రారంభం

## యర్రగొండపాలెం టీడీపీ ఇన్చార్జ్ గూడూరి ఎరిక్షన్ బాబు





**పెద్దారవీడు, పెన్ పవర్ మే 24**

పెద్దారవీడు మండల విద్యాశాఖాధికారి (ఎంఈవో) కార్యాలయంలో శంకర కంటి ఆసుపత్రి సౌజన్యంతో ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఆదివారం ఘనంగా ప్రారంభించారు. యర్రగొండపాలెం నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్చార్జ్ శ్రీ గూడూరి ఎరిక్షన్ బాబు ముఖ్య అతిథిగా విచ్చేసి ఈ శిబిరాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎరిక్షన్ బాబు గారు మాట్లాడుతూ... నియోజకవర్గ ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ఈ ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ప్రజలందరూ ఈ సువర్ణ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ మెట్టు శ్రీనివాసరెడ్డి,టిడిపి సీనియర్ నాయకులు గొట్టం శ్రీనివాస రెడ్డి, దుగ్గెంపూడి కొండా రెడ్డి,చంద్రగుంట్ల నాగేశ్వర రావు, జడ్డ రవి,ఏరువ పాపిరెడ్డి ,కందుల కాశిరెడ్డి కూటమి నాయకులు పాల్గొన్నారు.

# పోలేరమ్మ తల్లి కి పూసల బండి కట్టి మొక్కులు చెల్లించిన మారెళ్ళ రవికుమార్



**సి ఎస్ పురం, పెన్ పవర్ మే 24**

మండలంలోని గుంతచెన్నంపల్లి గ్రామంలో గ్రామ దేవత పోలేరమ్మ తల్లి తిరుణాళ్ల వేడుకలు ఆదివారం భక్తిశ్రద్ధలతో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో పొంగళ్ళు, పూసల బండి కార్యక్రమాలు అంగరంగ వైభవంగా నిర్వహించారు గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొని పొంగళ్ళు అమ్మవారికి నైవేద్యం సమర్పించి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.ఈ సందర్భంగా టిడిపి నాయకులు మారెళ్ల రవికుమార్ కుటుంబ సభ్యులు తమ మొక్కుబడి నెరవేర్చుకుంటూ గ్రామదేవత పోలేరమ్మ తల్లికి ప్రత్యేక పూసల బండి కట్టి ట్రాక్టర్ పై ప్రత్యేకంగా సిద్ధం చేసి రంగురంగుల పూలతో, పూసలతో అలంకరించి పూసల బండిని స్వగృహం నుండి గ్రామ పురవీధుల గుండా ఘనంగా డప్పు వాయిద్యాలు, భక్తుల జైజై ధ్వానాలు, బాణాసంచా శబ్దాలతో గ్రామ వీధుల గుండా కొనసాగి పోలేరమ్మ తల్లి ఆలయానికి చేరుకుంది.ఈ సందర్భంగా మారెళ్ళ రవికుమార్ కుటుంబ సభ్యులు పోలేరమ్మ తల్లికి మొక్కులు చెల్లించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కోటగిరి శ్రీను గ్రామస్తులు భక్తులు పాల్గొన్నారు.

# ప్రజలు అప్రమత్తంగా ఉండాలి -ఎస్ ఐ రాజేష్

**పొదిలి, పెన్ పవర్, మే 24**

వేసవికాలం దృష్ట్యా ప్రజలు అన్ని విధాల అప్రమత్తంగా ఉండాలని పొదిలి మండల పోలీసు సబ్ ఇన్స్పెక్టర్ సూరెడ్డి రాజేష్ చెప్పారు. ఎండల వల్ల రాత్రిపూట ఆరుబయట నిద్రించే అలవాటు ఉన్నవారు, తమ ఇంటికి కచ్చితంగా తాళాలు వేసుకోవాలని సూచించారు. అలాగే ఏదైనా పనిమీద ఊరికి వెళ్లేటప్పుడు వరండాలో లైట్లు ఆపి వెళ్లాలని, తమ ఇళ్లలో అన్ని జాగ్రత్తలు తీసుకొని వెళ్లాలని ఎస్ ఐ రాజేష్ సూచించారు. వేరే గ్రామాలకు లేదా దూర ప్రాంతాలకు వెళ్లేటప్పుడు ఆ సమాచారాన్ని పోలీస్ స్టేషన్లో తెలియజేయడం వల్ల అటువంటి ఇంటిపై పోలీసులు ప్రత్యేక నిఘా ఉంచడం జరుగుతుందని ఎస్ ఐ రాజేష్ చెప్పారు. అలాగే ఎవరైనా అనుమానాస్పదంగా సంచరిస్తున్న, లేదా కొత్త వ్యక్తులు కనిపించిన పోలీసులకు సమాచారం అందించాలని ఎస్ ఐ రాజేష్ కోరారు. అలాగే ఎక్కడ ఎటువంటి అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నప్పటికీ వాటిని పోలీసుల దృష్టికి తీసుకొని రావాలని ఎస్ ఐ కోరారు. సమాచారం అందించిన వ్యక్తుల వివరాలను




గోప్యంగా ఉంచుతామని నేరాల నియంత్రణకు ప్రజలు పోలీసు శాఖకు సహకరించాలని ఎస్ ఐ రాజేష్ కోరారు.

# ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలి

## ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ బ్రహ్మానంద రెడ్డి



**పొదిలి, పెన్ పవర్, మే 24**

ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆర్ టి సి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ బ్రహ్మానంద రెడ్డి ఆదేశించారు. ఆదివారం నాడు ఆయన పొదిలి ఆర్టీసీ బస్టాండ్ ను ఆకస్మిక తనిఖీ జరిపారు. ఈ సందర్భంగా ఆయన బస్టాండ్ లోని వివిధ స్టాల్స్ తో పాటు టాయిలెట్స్ ని పరిశీలించారు. ఆర్టీసీ సంస్థ కు ప్రయాణికులే అతి ముఖ్యమని, అందువల్ల ప్రయాణికులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపైనే ఉందని చెప్పారు. అలాగే డిపోకు సంబంధించిన సమస్యలను డిఎం శంకరరావును అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆర్టిసి రీజినల్ మేనేజర్ సత్యనారాయణ తదితరులు కూడా పాల్గొన్నారు.

# గుంతచెన్నంపల్లిలో ముగిసిన క్రికెట్ పోటీలు

## ఫైనల్లో సత్తా చాటిన మారెళ్ళ యూత్ క్రికెట్ జట్టు





**సి ఎస్ పురం, పెన్ పవర్ మే 24**

మండలంలోని గుంత చెన్నంపల్లె గ్రామంలో శ్రీరామనవమి మరియు పోలేరమ్మ తిరునాళ్ల సందర్భంగా ఆదివారం జరిగిన ఫైనల్ మ్యాచ్ లో గుంతచెన్నంపల్లె గ్రామానికి చెందిన మారెళ్ల యూత్ క్రికెట్ జట్టు అద్భుత ప్రదర్శన చేసి విజేతగా నిలిచింది. విజేత జట్టుకు నిర్వాహకులు తొలి బహుమతిగా రూ.10,116 నగదును అందజేశారు. ఫైనల్ పోటీని వీక్షించేందుకు గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై ఆటగాళ్లను ఉత్సాహపరిచారు.

# హైబ్రిడ్ డిజిటల్ మహానాడును విజయవంతం చేద్దాం

## టిడిపి నియోజకవర్గ పోల్ మేనేజ్మెంట్ క్లస్టర్ ఇంచార్జ్ కందుల రామిరెడ్డి





**మార్కాపురం పెన్ పవర్ మే24**

నియోజకవర్గంలో ఈ నెల 2,728 తేదీలలో అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించబడనున్న హైబ్రిడ్ డిజిటల్ మహానాడు కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి టీడీపీ కుటుంబ సభ్యులందరూ పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని టిడిపి నియోజకవర్గ పోల్ మేనేజ్మెంట్ క్లస్టర్ ఇంచార్జ్ కందుల రామిరెడ్డి కోరారు. ఆదివారం స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో మార్కాపురం పట్టణ, మండల కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో తెలుగుదేశం నియోజకవర్గ పోల్ మేనేజ్మెంట్ క్లస్టర్ ఇంచార్జ్ కందుల రామిరెడ్డి,ఆయా క్లస్టర్ ఇన్చార్జీలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కుటుంబ సాధికార సారథులు, బూత్ ఇంచార్జు, యూనిట్ ఇంచార్జు, క్లస్టర్ ఇంచార్జు, గ్రామ కమిటీ సభ్యులు, మండల కమిటీ సభ్యులు, అనుబంధ సంఘాల ప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తెలుగుదేశం పార్టీ కుటుంబ సభ్యులందరూ పాల్గొని కార్యక్రమాన్ని ఘన విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.ప్రజల సంక్షేమం, పార్టీ అభివృద్ధి, భవిష్యత్ కార్యాచరణపై కీలక చర్చలు జరగనున్న ఈ డిజిటల్ మహానాడు కార్యక్రమం పార్టీకి ఎంతో ముఖ్యమైందన్నారు. ప్రతి కార్యకర్త తన బాధ్యతగా భావించి అధిక సంఖ్యలో హాజరై పార్టీ ఐక్యతను, బలాన్ని చాటాలని తెలియజేశారు. తెలుగుదేశం పార్టీ సిద్ధాంతాలు, అభివృద్ధి పట్ల అంకితభావాన్ని మరోసారి ప్రపంచానికి చాటే ఈ మహత్తర కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి అందరూ సమిష్టిగా కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు.

## వైస్సార్సీపీలో ప్రతి కార్యకర్తకు గౌరవం ఉంటుంది

### వైస్సార్సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎమ్మెల్యే తాటిపర్తి



**ఆర్ సి ఇంచార్జి యర్రగొండపాలెం పెన్ పవర్ మే 24**

వైస్సార్సీపీ ప్రజల పక్షాన పోరాడుతుందని, పార్టీలో ప్రతి కార్యకర్తకు గౌరవం, గుర్తింపు ఉంటుందని వైస్సార్సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ అన్నారు. మండలంలోని వీరబద్రపురం టీడీపీ సీనియర్ నాయకులు బత్తుల శ్రీను ఆదివారం ఎమ్మెల్యే సమక్షంలో వైసీపీ లో చేరారు. ఈ సందర్భంగా తాటిపర్తి చంద్రశేఖర్ శ్రీనుకు పార్టీ కండువవేసి పార్టీలోకి ఆహ్వానించారు.ఈ సందర్భంగా అయన మాట్లాడుతు రాష్ట్రంలో ప్రజలందరూ జగనన్న పాలన మళ్ళీ రావాలని కోరుకుంటున్నారని, కూటమి పాలనకు ప్రజలు ఛీ కొడుతున్నారని అన్నారు.వైస్సార్సీపీ లో నాయకులు, కార్యకర్తలకు తగిన ప్రాధాన్యత ఉంటుందనిఅన్నారు. బత్తుల శ్రీను మాట్లాడుతు ఎమ్మెల్యే నాయకత్వం ఎంతో నచ్చిందని పార్టీ కోసం పనిచేసే వారికీ ఆయన అండగా ఉండటం నచ్చి కార్యకర్తలకు గుర్తింపు ఇవ్వని టీడీపీని వదిలి వైసీపీ చేరానని అన్నారు.కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు ఏకుల మునలారెడ్డి, అది శేషు, కందూరి గురు ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

## జనసైనికుడు రమణ సేవలు అమూల్యం :ఎమ్మెల్యే బొలిశెట్టి



**తాడేపల్లిగూడెం. పెన్ పవర్. మే 24:** బలుసులమ్మ సేవకుడు,పాతూరు యూత్ సభ్యుడు,జనసైనికుడు చవ్వాకుల రమణ సమాజానికి అమూల్యమైన సేవలు అందించారని శాసన సభ్యులు, రాష్ట్ర ప్రభుత్వ విప్ బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. చిన్న వయసులోనే ఆయన ఆకస్మిక మరణం చెందటం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక పాతూరులో రమణ కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే పరామర్శించారు. తన వ్యక్తి గత సహాయంగా రూ.3లక్షలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాతూరు యూత్ సభ్యునిగా,బలుసులమ్మ సేవకుడిగా మరువలేని సేవలు అందించారని కొనియాడారు. బలుసులమ్మ జాతర సందర్భంగా అహర్నిశలు భక్తులకు సేవలు అందించారని అన్నారు.జనసేన కార్యకర్తగా పార్టీ కార్యక్రమాలలో చురుగ్గాపాల్గొనే రమణ లేకపోవడం పార్టీకి తీరనిలోటని అన్నారు. రమణ ఇద్దరు కుమారుల విద్యాభ్యాసానికి సహకరిస్తానని తెలియజేశారు. రమణ కుటుంబానికి సహకరించిన ఎమ్మెల్యే బొలిశెట్టికి పాతూరు యూత్ సభ్యులు ధన్యవాదాలు తెలిపారు. జనసేన నాయకులకు ఈ కార్యక్రమంలో పైబోయిన వెంకటరామయ్య, పాలూరి వెంకటేశ్వరరావు చాపల రమేష్, మద్దాల మణికుమార్, కాళ్ల గోపికృష్ణ, శ్రీరంగం అంజి, పట్నాల రాంపండు, గుండుమొగుల సురేష్, నల్లగంచి రాంబాబు, దాట్ల జగన్నాథ రాజు, బైన పాలపు ముఖేష్,తదితరులు రమణ కుటుంబ సభ్యులను పరామర్శించారు.

## మహానాడు కు వేలాదిగా తరలి వెళ్ళాలి.

* టిడిపి రాష్ట్ర కార్యదర్శి కన్నబాబు పిలుపు





**గోకవరం పెన్ పవర్ మే 24:--** తెలుగుదేశం పార్టీ మహానాడు విజయవంతానికి వేలాదిగా ప్రతి ఒక్కరు తరలి రావాలని రాష్ట్ర తెలుగుదేశం పార్టీ కార్యదర్శి ప్రశాంత్ కుమార్ హోలోనేన్ (కన్నబాబు) పిలుపు నిచ్చారు ఇందులో భాగంగా గోకవరం మండలం కృష్ణునిపాలెంలో ఆదివారం సమావేశమయ్యారు. టిడిపి రాష్ట్ర కార్యదర్శి కన్నబాబు మాట్లాడుతూ టిడిపి పార్టీ ఆదేశాల మేరకు జరగబోవు మహానాడు కార్యక్రమం విజయవంతం చేయాలని ఆదేశాలు ఇచ్చిన నేపథ్యంలో మహనీయుడు ఎన్టీఆర్ ఖ్యాతిని ప్రపంచ వ్యాప్తంగా మారుమ్రోగే విధంగా కార్యక్రమం నిర్వహించాలని కన్నబాబు కోరారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు,మంత్రి నారా లోకేష్ రాష్ట్రటిడిపి అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు, ఎమ్మెల్యే, టిటిడి టిడిపి పోలిట్ బ్యూరో సభ్యులు జ్యోతుల నెహ్రూ లు ఈ కార్యక్రమాన్ని ఎంతో ప్రతిష్టాత్మంగా తీసుకున్నారని ఈ కార్యక్రమం విజయవంతం చేసే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమం లో గోకవరం సొసైటీ చైర్మన్ గాజింగం సత్తిబాబు, దాసరి తమ్మనదొర,మండల కన్వీనర్ పిల్లా చంటి బాబు మాజీ జెడ్పిటిసి పాలూరి బోసిబాబు, తంటి కొండ దేవస్థానం చైర్మన్ బద్దిరెడ్డి అచ్చన్న దొర,మండల ప్రధాన కార్యదర్శి గునిపే భరత్,బద్దిరెడ్డి బాబి, దాసరి సీతారామకృష్ణ,బత్తుల సత్తిబాబు, మలిరెడ్డి సిరి, పులపర్తి బుజ్జి, గళ్ళ రాము, బద్దిరెడ్డి రవి, మండిగ గంగాధర్, మండిగ బాలాజీ, గుండా శివప్రసాద్,సిద్ధ సత్యనారాయణ, కోన శివ నాయుడు, మేడిశెట్టి వీరబాబు, పసుమర్తి బుజ్జి, లంక పోసి రావు, గేదెల చిన్న సుబ్బారావు, లంక పోసిరావు,కొంగరపు రాజు గోకవరం, కృష్ణుని పాలెం, తంటికొండ , గాదేలపాలెం, ఇటుకాయలపల్లి, గోపాలపురం గ్రామాలలోని యూనిట్ ఇన్చార్జిలు, గ్రామ పార్టీ అధ్యక్షులు, బూత్ ఇన్చార్జిలు, టిడిపి నాయకులు,తదితరులు పాల్గొన్నారు.

## గొంతిన సురేష్ ఆధ్వర్యంలో ఘనంగా ఎమ్మెల్యే సత్యప్రభ జన్మదిన వేడుకలు



**కిర్లంపూడి/ప్రత్తిపాడు,పెన్ పవర్, మే 24**:ప్రత్తిపాడు మండలం లంపకలోవ గ్రామంలో ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ రాజా జన్మదిన వేడుకలు మాజీ సొసైటీ అధ్యక్షులు గొంతిన సురేష్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా భారీ కేక్ కట్ చేసి ఎమ్మెల్యేకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా గొంతిన సురేష్ మాట్లాడుతూ ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ రాజా నియోజకవర్గంలో ప్రజా సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని పేర్కొన్నారు.ప్రజల సమస్యల పరిష్కారానికి నిరంతరం అందుబాటులో ఉంటూ,అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు నడిపిస్తున్న ఆమె నాయకత్వం ప్రజల్లో విశ్వాసాన్ని పెంచుతోందని ప్రశంసించారు. సేవాభావంతో కూడిన పాలనతో నియోజకవర్గాన్ని అభివృద్ధి దిశగా తీసుకెళ్తున్నారని అభిప్రాయపడ్డారు.ఈ కార్యక్రమంలో గంటా నాగేశ్వరావు, గంటా చంటిబాబు,లింగంపల్లి వెంకటేశ్వరరావు,దార్లంక వీర్రాజు,గీశాల రాజుబాబు,పందుగుల రాము, అల్లం వెంకటేశ్వర్లు,చనుబోయిన కృష్ణ,కింతాడ యతిమాని,తొర్ల విజయేంద్ర,గంపా సత్తిబాబు,పంది సూరిబాబు,వనుము నూకరాజు,చీకట్ల వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

# అంబవరంలో పునీత ఆంటోనీ పాదువా పురి స్వరూపమును ఆవిష్కరణ





**సి ఎస్ పురం, పెన్ పవర్ మే 24**

మండలంలోని అంబవరం గ్రామంలో ఆదివారం ఆధ్యాత్మిక వాతావరణం నడుమ పునీత ఆంటోనీ వారి స్వరూపం ఆవిష్కరణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. గ్రామానికి చెందిన సిస్టర్ జయ మరియు మంకెన రాజేష్ ఖన్నా సిల్వర్ జాబిలి మఠవాస, గురుత్వ జీవితం 25 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఈ కార్యక్రమాన్ని ప్రత్యేకంగా ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా నెల్లూరు పీఠాధిపతి బిషప్ డాక్టర్ పిల్లి ఆంథోనీదాస్ అంబవరం గ్రామంలోని నేషనల్ హైవే సమీపంలో ఏర్పాటు చేసిన పునీత ఆంటోనీ వారి స్వరూపాన్ని ఆవిష్కరించి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పునీత ఆంటోనీ మహిమలు, అద్భుతాలను క్యాథలిక్ భక్తులు విశ్వాసంతో ఆరాధిస్తారని తెలిపారు. విశ్వాసం, సేవాభావం, దైవభక్తితో జీవనం సాగిస్తే సమాజానికి మంచి సందేశం అందుతుందని పేర్కొన్నారు.కార్యక్రమంలో ప్రత్యేక ప్రార్థనలు, ఆరాధనలు భక్తిశ్రద్ధలతో నిర్వహించగా, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని ప్రార్థనలు చేశారు. అనంతరం గ్రామ పెద్దలు గుంటిమడుగు వెంకటరామరాజు, అద్దంకి రమణయ్య, లక్కీ పోగు ప్రసాద్, ముప్పాళ్ల కృష్ణంరాజు, ముప్పాళ్ల లైబ్రరీ నరసరాజు, కమ్మనేతి సుబ్బమ్మ వెంకటేశ్వర్లు, నల్లమడుగుల మాజీ సర్పంచ్ ఆంతోని, కలవెలి రవి తదితరులు బిషప్ డాక్టర్ పిల్లి ఆంథోనీదాస్ ను ఘనంగా సన్మానించి శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఫాదర్ మంకెన రాజేష్ ఖన్నా, హృదయ రాజు, విచారణ కర్తలు మనోహర్, పవన్, ప్రముఖ క్రిస్టియన్ సింగర్ టోనీ ప్రకాష్, గ్రామ పెద్దలు లక్కీ పోగు ప్రసాద్, ఆనంద్, పారా శివ, కమ్ములూరి ప్రభాకర్, యేసు రత్నం, రాజేష్, మంకెన గణేష్, మరియు గణేష్ నిపల్లి విచారణ ప్రజలు దివ్యబలి పూజలో పాల్గొని గురువుల ఆశీస్సులు పొందారు.

# అశ్రు నివాళి

**కందుకూరు పెన్ పవర్ మే 24**

వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కందుకూరు నియోజకవర్గం వాణిజ్య విభాగం అధ్యక్షులు కందగడ్ల వెంకటేశ్వర్లు ధర్మపత్ని అనారోగ్య పరిస్థితుల్లో మరణించారు. ఆమె మృతికి సంతాపాన్ని తెలియజేస్తూ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు వాసవి నగరిలోని వారి స్వగృహం నందు ఆమె పార్థీవ దేహాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. ఆమె పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ఆమె విడిచి వెళ్లిన కుటుంబ సభ్యులు మనో ధైర్యంతో ఉండాలని వైఎస్ఆర్సిపి నాయకులు తోకల కొండయ్య, షేక్ రఫీ, గణేశం గంగిరెడ్డి, ముప్పవరపు కిషోర్, చెన్నారెడ్డి వెంకటేశ్వర్లు, తలపనేని గోపి, షేక్ షేక్ సుల్తాన్ తదితరులు ఆకాంక్షించారు. ఆ కుటుంబానికి తమ ప్రగాడ సానుభూతిని తెలియజేశారు.



## సిరిగిందలపాడులో రామకృష్ణ మిషన్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం





### 120 మంది గిరిజనులకు వైద్య సేవలు

**గంగవరం/ రంపచోడవరం, పెన్ పవర్ ,మే 24**:రంపచోడవరం మండలంలోని సిరిగిందలపాడులో రామకృష్ణ మిషన్ ఆధ్వర్యంలో ఆదివారం ప్రత్యేక ఉచిత వైద్య శిబిరం నిర్వహించినట్లు మిషన్ కార్యదర్శి స్వామి పరిజ్ఞేయనందజీ మహారాజ్ తెలిపారు. గిరిజన ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో ఈ శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు ఆయన పేర్కొన్నారు.ఈ సందర్భంగా నిర్వహించిన వైద్య శిబిరంలో సుమారు 120 మంది రోగులకు వైద్య సేవలు అందించినట్లు తెలిపారు. వైద్యులు డాక్టర్ తలారి వెంకట సుబ్బారావు, డాక్టర్ దాసరి ఉమా మహేష్, డాక్టర్ పావని ప్రియ పాల్గొని రోగులను పరీక్షించి తగిన చికిత్స అందించారు.శిబిరంలో భాగంగా 45 మందికి రక్తపరీక్షలు నిర్వహించగా, 8 మందికి థైరాయిడ్ పరీక్షలు చేశారు. అదేవిధంగా ఒకరికి ఈసీజీ, మరొకరికి ఎక్స్రే పరీక్షలు నిర్వహించినట్లు తెలిపారు. కీళ్ల నొప్పులు, నరాల సమస్యలతో బాధపడుతున్న 16 మందికి ఫిజియోథెరపీ సేవలు అందించారు.వైద్య శిబిరానికి హాజరైన రోగులు, వారి సహాయకులకు అన్నదాన కార్యక్రమం కూడా నిర్వహించినట్లు స్వామి పరిజ్ఞేయనందజీ మహారాజ్ తెలిపారు. దూర ప్రాంత గిరిజనులకు ఈ శిబిరం ఎంతో ఉపయోగకరంగా నిలిచిందని గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో రామకృష్ణ మిషన్ సిబ్బంది, వైద్య సేవల సమన్వయకర్త కానుమొను శ్రీనివాస్, వాలంటీర్ దాసరి పెద్ద అప్పారావు తదితరులు పాల్గొన్నారు.



## విశ్రాంత ఉపాధ్యాయని రాజమ్మకు నివాళులు



**గిద్దలూరు పెన్ పవర్ మే 24**

గిద్దలూరు మండలం ముండ్లపాడు సెంట్ జాకబ్ యూ పి పాఠశాలలో ఉపాధ్యాయుని గా గా పని చేస్తూ ఇటీవల పదవి విరమణ చేసిన విశ్రాంత ఉపాధ్యాయిని వి రాజమ్మ ఆదివారం మరణించారు. విషయం తెలుసుకున్న విశ్రాంత ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షులు జి రవీంద్రనాథ రెడ్డి , గిద్దలూరు సంఘసభ్యులు ముండ్లపాడు గ్రామాన్ని కి వెళ్లి రాజమ్మ పార్థివ దేహంపై పుష్ప గుచ్ఛాముంచి నివాళులు అర్పించారు .కుటుంబ సబ్యులను పరామర్శించి ఓదార్చారు.

## విద్యార్థులను ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు



**సి ఎస్ పురం, పెన్ పవర్ మే 24**

మండల కేంద్రంలోని సి ఎస్ పురం గ్రంథాలయంలో గ్రంథాలయ పాలకుడు ఆళ్ల భాస్కర్ రావు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరం ఆదివారం 16 మంది విద్యార్థినీ విద్యార్థులు హాజరై వివిధ కార్యక్రమాలలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా విద్యార్థులకు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి బోధన సిబ్బంది విద్యార్థులకు స్పోకెన్ ఇంగ్లీష్ లో శిక్షణ ఇచ్చి సరదాగా ఆటలు ఆడించారు. సాంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా పాటలు, డ్యాన్సు నిర్వహించి విద్యార్థుల్లో ఉత్సాహాన్ని నింపారు.అనంతరం విద్యార్థులకు మజ్జిగ ప్యాకెట్లు, చాక్లెట్లు పంపిణీ చేశారు ఈ కార్యక్రమంలో గ్రంథ పాలకుడు ఆళ్ల భాస్కర్ రావు, ఫార్మా లెక్చరర్ నారపు శెట్టి ఆంజనేయులు, బోధన సిబ్బంది చింతం భారతి, అయేషా విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

# ఆయిల్ పామ్ పంటలో ఎరువుల యాజమాన్యంపై అవగాహన సదస్సు






**తాడేపల్లిగూడెం. పెన్ పవర్. మే. 24.** డాక్టర్ వై.ఎస్.ఆర్. ఉద్యాన విశ్వవిద్యాలయం కి చెందిన కృషి విజ్ఞాన కేంద్రం, చే మార్లముడి గ్రామంలో నిర్వహించిన రైతు సదస్సులో ఆయిల్ పామ్ పంటలో అధిక దిగుబడి, నాణ్యమైన ఫలాలు కోసం ఎరువుల యాజమాన్యం తప్పనిసరి అని నిపుణులు స్పష్టం చేశారు. డాక్టర్ ఇ. రేఖ, శాస్త్రవేత్త (ఉద్యాన విభాగం), కేవీకే, వేంకటరామన్నగూడెం మాట్లాడుతూ "ఆయిల్ పామ్ ఎక్కువ కాలం (25-30 ఏళ్లు) దిగుబడి ఇచ్చే పంట. కానీ సమతుల్య ఎరువుల యాజమాన్యం లేకపోతే దిగుబడి తీవ్రంగా తగ్గిపోతుంది. యూరియా, డీఏపీ, పొటాష్, మెగ్నీషియంలతో పాటు మైక్రోన్యూట్రియెంట్లు (బోరాన్, జింక్) సరైన సమయంలో, సరైన మోతాదులో వేయాలి."

ఆయిల్ పామ్ పంటలో అధిక దిగుబడి మరియు నాణ్యమైన పంటను పొందడానికి సరైన ఎరువుల యాజమాన్యం చాలా ముఖ్యం. ఎరువుల నిర్వహణ యొక్క ప్రాముఖ్యత: ఆయిల్ పామ్ అధిక పోషకాల అవసరమున్న పంట. పోషక లోపం వల్ల తక్కువ దిగుబడులులే కాక నూనె నాణ్యత కూడా తగ్గుతుంది. సమతుల్య ఎరువుల వాడకం దిగుబడిని పెంచుతుంది మరియు నేల ఆరోగ్యాన్ని కాపాడుతుంది. ఆయిల్ పామ్ పంటకు అవసరమైన పోషకాలు: ఆయిల్ పామ్ మొక్కల ఆరోగ్యకరమైన పెరుగుదలకు మరియు అధిక ఫలసాయానికి అనేక రకాల పోషకాలు అవసరం. వీటిలో ముఖ్యమైనవి: నత్రజని. ఆకుల పెరుగుదలకు, మొక్క ఏపుగా పెరగడానికి ఇది చాలా అవసరం. భాస్వరం: వేర్ల అభివృద్ధికి, పూత మరియు పిందె ఏర్పడటానికి అతి ముఖ్యమైనది. పొటాషియం : గెలల అభివృద్ధికి, నూనె శాతాన్ని పెంచడానికి, మరియు వ్యాధి నిరోధక శక్తికి ఇది కీలకం. మెగ్నీషియం : పత్రహరితం తయారీలో ముఖ్య పాత్ర పోషిస్తుంది, ఆకులు ఆకు పచ్చగా ఉండటానికి సహాయపడుతుంది. బోరాన్ : పరాగసంపర్కం, కణ విభజన మరియు గెలల అభివృద్ధికి అవసరం.

నేల మరియు ఆకుల విశ్లేషణ: పంట నాటే ముందు నేల పరీక్ష చేయడం ద్వారా సరైన ఎరువుల సిఫార్సు పొందవచ్చు. పత్ర విశ్లేషణ (17వ ఆకును తీసుకుని) ద్వారా పోషకాల స్థితిని తెలుసుకోవచ్చు. ప్రతి రెండు నుండి మూడు సంవత్సరాలకొకసారి పరీక్ష చేయాలి. ఎరువులు వేసే ముందు భూసార పరీక్ష చేయించుకోవడం చాలా ముఖ్యం. దీని ద్వారా నేలలో ఏఏ పోషకాలు ఎంత మోతాదులో ఉన్నాయో తెలుసుకొని, దానికి అనుగుణంగా ఎరువుల యాజమాన్యం చేపట్టవచ్చు.

నీటిపారుదల యాజమాన్యం కూడా ఎరువుల సమర్థ వినియోగానికి చాలా ముఖ్యం. డ్రిప్ పద్ధతి ద్వారా నీటిని అందించడం వలన నీరు ఆదా అవ్వడమే కాకుండా ఎరువులు నేరుగా మొక్క వేర్ల వద్దకు చేరుతాయి. సమగ్ర సస్యరక్షణ చర్యలు పాటిస్తూ, కలుపు నివారణ చేపడుతూ ఉంటే ఎరువుల పూర్తి ప్రయోజనం మొక్కలకు అందుతుంది. సూక్ష్మపోషకాలు: ఆయిల్ పామ్ తోటల్లో ముఖ్యంగా సూక్ష్మపోషకధాతు లోపాలు తలెత్తకుండా బోరాన్ మరియు మెగ్నీషియంను సంవత్సరానికి రెండు, మూడు దఫాలుగా తప్పనిసరిగా అందించాలి. వీటిని ఇతర ఎరువులతో కలపకుండా ప్రత్యేకంగా వేయాలి.

సేంద్రీయ ఎరువులు: 500 కిలోల పశువుల ఎరువు, 10 కిలోల వేప పిండి మరియు 5 కిలోల మెటారైజియం శిలీంధ్రాన్ని కలిపి నీడలో పెట్టి గోనె సంచులు కప్పి ప్రతి రోజు నీటిని వెదజల్లుతూ వారం రోజుల ఉంచి తర్వాత 5 కిలోలు ప్రతి మొక్క చుట్టూ వేసుకొని ఎగద్రోయాలి. తోటల్లో నరికిన ఆకులను చెట్ల మధ్య మల్చింగ్ చేసినట్లయితే ఇవి కుళ్లి సేంద్రీయ ఎరువుగా ఉపయోగపడటంతోపాటు, నేల యొక్క తేమను నిలుపుకునే శక్తి పెరుగుతుంది. జనుమును ఆయిల్ పామ్ పాదు చుట్టూ పచ్చి రొట్ట ఎరువుగా పెంచుకోవడం కూడా మంచిది.

నీటి యాజమాన్యం: ఆయిల్ పామ్ కు నీటి వసతి చాలా ముఖ్యం. సరైన నీటి యాజమాన్యం పాటించినట్లయితే మగపువ్వుల కంటే ఆడపువ్వులు ఎక్కువగా వచ్చి దిగుబడులు పెరుగుతాయి. శ్రీమతి బాబిత , ఉద్యాన అధికారి , నల్లజర్ల మండలం మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం అనేక పథకాలు అమలు చేస్తుంది. ముఖ్యంగా వరి నుంచి ఆయిల్ పామ్ సాగుకు మారే రైతులకు భారీ సబ్సిడీ మరియు ప్రోత్సాహకాలు ఉన్నాయి. వరి కంటే ఆయిల్ పామ్లో స్థిరమైన మంచి ఆదాయం రావడమే కాకుండా, నీటి డిమాండ్ తక్కువగా ఉంటుంది.

అంతర పంటలు ప్రాముఖ్యతను నొక్కిచెప్పిన ఆమె --కొత్తగా వేసిన ఆయిల్ పామ్ తోటల్లో మొదటి 3-4 సంవత్సరాలలో అన్ని పంటలు సాగు చేసుకోవచ్చు. మిర్చి, పచ్చడి మిరప, టమాట, బెండ, దుంపలు, పప్పుధాన్యాలు అదనపు ఆదాయం ఇస్తాయి.

రైతులకు సూచనలు:

1. మట్టి పరీక్ష చేయించుకోండి (ప్రతి రెండేళ్లకు ఒకసారి).
2. ఎరువులను చెట్టు నీడ ప్రాంతంలో (ఫీడర్ రూట్లు ఉండే చోట) మాత్రమే వేయండి.
3. వర్షాకాలంలో ఎరువులు కొట్టుకుపోకుండా చూసుకోండి.
4. సేంద్రియ పదార్థాలు (కొబ్బరి పీచు, పామ్ ఖర్జూరం) కప్పు గా వాడండి. డా. ఎ. దేవివరప్రసాద్ రెడ్డి, శాస్త్రవేత్త (మత్స్య ఌ వెటర్నరీ సైన్స్ ఇన్చార్జ్) మాట్లాడుతూ --

రసాయన ఎరువులతో పాటు సేంద్రియ ఎరువులు వాడటం చాలా అవసరం. చెట్టు బోనులో సంవత్సరానికి 50-75 కిలోల, పశువుల పెంట లేదా వేర్మికంపోస్ట్ వేస్తే నేల ఆరోగ్యం మెరుగవుతుంది, నీరు నిలుపుకునే శక్తి పెరుగుతుంది. ఇది దీర్ఘకాలంలో ఎరువుల వినియోగాన్ని తగ్గిస్తుంది."

# నరసాపురం గ్రామంలో ముగ్గురు కుటుంబాలకు అండగా..


- గుడ్ ఫ్రెండ్స్ చారిటీ సభ్యులు 7000 రూపాయల కిట్టు పంపిణీ..
- ఎంపీటీసీ పీత శ్రీను ఆధ్వర్యంలో..






**కోరుకొండ, పెన్ పవర్, మే 24:** నరసాపురం గ్రామంలో మూడు నిరుపేద కుటుంబాలకు గుడ్ ఫ్రెండ్స్ చారిటీ సభ్యులు ఏడు వేల రూపాయలు విలువగల నిత్యవసర వస్తువుల కిట్టు నరసాపురం ఎంపీటీసీ పీత శ్రీను ఆధ్వర్యంలో ఆ కుటుంబాలకు పంపిణీ చేపట్టారు. ఈ సందర్భంగా శీను మాట్లాడుతూ గుడ్ ఫ్రెండ్స్ చారిటీ సభ్యులను అడగగానే ఇంతటి సహాయం చేసిన చారిటీ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. గ్రామంలో పలస అనసూయ, గోరాస రాముడు, వాసంశెట్టి దుర్గా కుటుంబాలకు ఏడు వేల రూపాయల విలువచేసే నిత్యవసర వస్తువులు కిట్టు తెలుగుదేశం పార్టీ నాయకులు గ్రామస్తులు ఆధ్వర్యంలో ఆ కుటుంబ సభ్యులకు అందించారు. ఈ కార్యక్రమంలో చారిటీ సభ్యురాలు మారిశెట్టి మాధురి, గుర్రం ఈశ్వరరావు, పెద్దపాటి సాయి,కోర్పు రాజేష్, నేలపాల రామకృష్ణ, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

# జూన్ 12 నుంచి మన వార్డులో మన ఆదిరెడ్డి



## వారానికి రెండు వార్డులు అధికారులతో సమీక్షలు

## ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్

**రాజమహేంద్రవరం పెన్ పవర్ మే 24:** కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు పూర్తవుతున్న సందర్భంగా సిటీ నియోజకవర్గంలో అభివృద్ధి పనులతో పాటు కూటమి పార్టీల క్యాడర్‌ను బలోపేతం చేయాలనే లక్ష్యంతో "మన వార్డులో మన ఆదిరెడ్డి" పేరుతో కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ ప్రకటించారు. జూన్ 12 నుంచి వారానికి రెండు రోజులు రెండు వార్డుల్లో పర్యటిస్తూ అన్ని ప్రభుత్వ శాఖల అధికారులతో సమీక్షలు, కార్యకర్తలతో ముఖాముఖి, కార్యకర్త ఇంట్లో రాత్రి బస, శానిటేషన్ పరిశీలనలు నిర్వహిస్తానని వెల్లడించారు. తిలక్ రోడ్డులోని రెడ్డీస్ కన్వెషన్ హాల్ లో సిఎంఆర్ ఎఫ్ చెక్కుల పంపిణీలో భాగంగా ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు.

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నిర్వహించిన జిల్లాల సమీక్షలో రాష్ట్రంలో నియోజకవర్గాల ర్యాంకింగ్‌లో సిటీ మొదటి ఆరు స్థానాల్లో నిలిచిందన్నారు. తన ఒక్కడి వల్ల రాజకీయ వ్యవస్థ నడవదని, కూటమి క్యాడర్ కృషి ఉందన్నారు. డ్రైనేజీ, రోడ్లు, నీటి శానిటేషన్ సమస్యలపై నిర్ణయాలు తీసుకుంటామన్నారు. మన వార్డు కార్యక్రమంలో భాగంగా కార్యకర్త లేదా నాయకుడి ఇంట్లో రాత్రి బస చేస్తానని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ ప్రకటించారు. ప్రాంతాన్ని బట్టి వ్యాపారులు, మహిళలు, డాక్టర్లు తదితర వర్గాలతో సమావేశాలు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమం ఓట్ల కోసం కాదని, ప్రజా సమస్యల పరిష్కారం, కూటమి క్యాడర్‌ను బలోపేతం చేయడానికే చేపడుతున్నామన్నారు. నగరంలో తెలుగుదేశం, జనసేన, బీజేపీ నాయకత్వాన్ని కలుపుకుంటూ సుమారు 300 రాజకీయ పదవులు ఇచ్చిమన్నారు.

రూ.5.07 కోట్ల సీఎంఆర్ ఎఫ్ సహాయం :

ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ఇప్పటివరకు రూ.5,07 కోట్ల విలువైన 596 చెక్కులు పంపిణీ చేసినట్లు ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ వెల్లడించారు. ఇంకా రూ. 2,80 కోట్ల విలువైన 138 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కొత్త పెన్షన్లు మంజూరు అవుతున్నాయన్నారు.ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సోమవారం పుష్కర ఘాట్ నుంచి బోటు ద్వారా కోట్లింగాల రేవు, నల్లా ఛానల్ ప్రాంతాల్లో గోదావరి కాలుష్యం, పుష్కర పనులను పరిశీలిస్తారని తెలిపారు. అనంతరం కార్పొరేషన్ కార్యాలయంలో పుష్కర పనులపై సమీక్ష నిర్వహిస్తాన్నారు. మే 27, 28 తేదీల్లో డిజిటల్ మహానాడు న్ని సిటీలో 10 క్లస్టర్లుగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతి క్లస్టర్‌లో బూత్ ఏజెంట్లు, యూనిట్ ఇంచార్జులు, కుటుంబ సాధికారత సభ్యులు, రాష్ట్ర నాయకులు పాల్గొంటారని పేర్కొన్నారు.

పుష్కర ఘాట్ పనుల కాంట్రాక్టర్ పై ఆగ్రహం : కొత్తగా వేస్తున్న స్టోన్స్ జారుతున్నాయని అడగ్గా కాంట్రాక్టర్ తమతో ఇష్టానుశారంగా మాట్లాడం పై మరోసారి నోరు జారితే ఊరుకునేది లేదని హెచ్చరించారు. రాజస్థాన్ నుంచి తెచ్చిన స్టోన్స్ నీరు పడితే జారుతున్నాయని జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. గోదావరి మాత విగ్రహం ఎదురుగా ఫౌంటెన్ అవసరం లేదన్నారు. ఈ విషయాన్ని ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి దృష్టికి తీసుకెళ్లగా, ఆమె అసహనం వ్యక్తం చేశారన్నారు. ఈ మీడియా సమావేశంలో ఏపీ శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్ కుడుపూడి సత్తిబాబు, కూటమి నాయకులు , నక్కా చిట్టిబాబు, కాశీ నవీన్ కుమార్, , అత్తి సత్యనారాయణ, ఉప్పులూరి జానకీ రామయ్య, నిమ్మలపూడి గోవింద్, ద్వారా పార్వతి సుందరి, తురకల నిర్మల, సయ్యద్ అప్పర్సీ, జక్కంపూడి అర్జున్, , కంటిపూడి శ్రీనివాస్, కంటిపూడి రాజేంద్రప్రసాద్, అరుగు ధన్‌రాజ్, , కోసూరి చండీప్రియ, బేసరి చిన్ని, మీసాల నాగమణి, తుల్లి పద్మ, , మోతా నాగలక్ష్మి, బత్తుల కిరణ్‌బాబు, కోర్పు రామారావు తదితరులు పాల్గొన్నారు

# వెదుళ్ళమ్మ జాతర ఏర్పాట్లపై అధికారులు పరిశీలన



**సీతానగరం, పెన్ పవర్, మే:24:** సీతానగరం మండలంలోని 31 ఈనెల చిన కోండేపూడి గ్రామదేవత వెదుళ్ళమ్మ జాతరలో ఎటువంటి ఇబ్బందులు కలగకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని జాతర ఉత్సవకమిటీ వారికి నార్త్ జోన్ డిఎస్పి జీవన శనివారం సూచించారు. అనంతరం

గ్రామ దేవత వెదుళ్ళమ్మ అమ్మవారిని

డి ఎస్పీ జీవన కొరుకోండ సీఐ ఎస్ వి.వి. ఎస్ మూర్తి ఎస్సై బి. వినయ్ ప్రతాప్ దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ ఏర్పాట్లను పరిశీలించి అనంతరం కమిటీ సభ్యులు తో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భక్తులకు అసౌకర్యం లేకుండా జాతర కమిటీ ప్రత్యేక శ్రద్ధ వహించాలంటూ సూచించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ బాణాసంచా కాల్చ రాదన్నారు. అసాంఘిక కార్యక్రమాలను ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించేది లేదని కరాఖండిగా తెలిపారు. 31న నైవేద్యాలు కారణంగా గ్రామంలోకి వచ్చే ఇతర ప్రాంతాల వారి వాహన రాకపోకలు ఏవిధంగా జరపాలి ఎక్కడ పార్కింగ్ ఏర్పాట్లు చేయాలి అనేది జాతర కమిటీ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. జాతర సందర్భంగా వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా పటిష్టమైన ఏర్పాట్లు చేయాల్సి ఉంటుందని జాతర కమిటీ సభ్యులకు అధికారులు సూచించారు.


# నందమూరు గ్రామంలో ఉచిత మెగా వైద్య శిబిరం...






**తాడేపల్లిగూడెం. పెన్ పవర్. మే 24.** తాడేపల్లిగూడెం మండలం పరిధి లో నందమూరు గ్రామం లో ఆదివారం ఉచిత మెగా వైద్య శిబిరం ఘనంగా నిర్వహించారు. జనసేన మరియు రాక్షభారత్ సోషల్ సర్వీస్ ఆర్గనైజషన్ ఆర్ధార్యంలో ఫ్యాబ్ హాస్పిటల్ సహకారంతో ఈ శిబిరన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమం లో ప్రముఖ వైద్యుడు డా.. వెంకట్ ఎంఎస్ ఆర్తో పాల్గొని సుమారు 200మందికి వైద్య సేవలు అందించారు. ఈ శిభిరం లో భాగంగా ఉచితంగా మందులు పంపిణి చేశారు, ఈ సందర్భంగా డా " వెంకట్ మాట్లాడుతూ గ్రామీనా ప్రాంతం లో ఇలాంటి సేవా కార్యక్రాలు చేయడం, కనీస ఖర్చులు తో వైద్యమందిచ్చడం తన తండ్రి డా! పి. ఎల్. వి. ప్రసాద్ నుండి వచ్చింది అని ప్రశంగించ్చారు. అనంతరమ్ జనసేన నాయకులు అడపా ప్రసాద్, దార్లంక రాము, అరసాల వీర వెంకట సత్యనారాయణ, చిలక శ్రీను, అరసాల వర ప్రసాద్ మరియు ర. ఎస్. ఎస్. ఒ డాక్టర్ ను ఘనంగా సత్కరించారు.

# ఎండాకాలం జాగ్రత్తలు తప్పనిసరి-డా.పి.స్వర్ణలత



**తాళ్ళపూడి, పెన్ పవర్, మే 24:** వేసవి కాలం ప్రారంభమైన నేపథ్యంలో ప్రజలు, ముఖ్యంగా వృద్ధులు, గర్భిణీలు, చిన్నపిల్లలు ఎండ తీవ్రతకు గురికాకుండా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని అన్నదేవరపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి డాక్టర్ పి.స్వర్ణలత సూచించారు. ఈ సందర్భంగా డాక్టర్ పి.స్వర్ణలత మాట్లాడుతూ దాహం వేయకపోయినా గంటకు ఒకసారి నీరు త్రాగాలని, రోజుకు కనీసం 3 నుండి 4 లీటర్ల నీరు తీసుకోవాలని, మజ్జిగ, కొబ్బరి నీళ్లు, నిమ్మరసం, ఓఆర్ఎస్ వంటి ద్రవ పదార్థాలు తీసుకోవడం వల్ల డీహైడ్రేషన్ బారిన పడకుండా ఉండవచ్చునని తెలిపారు. మధ్యాహ్నం 11 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు ఎండలో తిరగకూడదని చెప్పారు. బయటకు వెళ్లాల్సి వచ్చినప్పుడు గొడుగు, టోపీ, సన్ గ్లాసెస్ వాడాలిని, లేత రంగులో ఉండే వదులైన కాటన్ దుస్తులు ధరించడం శ్రేయస్కరం అని పేర్కొన్నారు. కీరదోస, పుచ్చకాయ, టమాట వంటి నీటి శాతం ఎక్కువగా ఉండే పండ్లు, కూరగాయలు తీసుకోవాలిని అన్నారు. మసాలా, నూనె పదార్థాలను తగ్గించి, బయటి ఆహారాన్ని వీలైనంత వరకు మానుకోవాలని తెలియజేశారు. వ్యాయామం ఉదయం లేదా సాయంత్రం వేళల్లో మాత్రమే చేయాలని సూచించారు. తలనొప్పి, వాంతులు, అలసట, కళ్లు తిరగడం వంటి లక్షణాలు కనిపిస్తే అది వడదెబ్బ కావచ్చునని, అలాంటి సమయంలో వెంటనే చల్లటి ప్రదేశంలో విశ్రాంతి తీసుకుంటూ, వైద్యులను సంప్రదించాలని, కూల్ డ్రింక్స్ అధికంగా తాగడం వల్ల వడదెబ్బ ముప్పు పెరుగుతుందని హెచ్చరించారు.

# జెన్ జీ ప్రభువులు గర్జిస్తున్నారు !

ప్రజాస్వామ్యంలో ప్రజలే ప్రభువులు. ఇది అక్షరాలా నిజం కూడా. తమ కోసం తమ తరఫున తమ గురించి పాటు పడుతూ సేవ చేసే వారిని ఎన్నుకోవడమే ప్రజాస్వామ్యంలో జరిగే ఎన్నికలు. వారిని ప్రజా సేవకులు అంటారు. అంటే ప్రజలు అంతిమ ప్రభువులు అయినపుడు వారు ఓట్లేసి గెలిపించిన వారు ప్రజా సేవకులు అవుతారు. ఇది ప్రజాస్వామిక ముఖ్య సూత్రం. మౌలికమైన విషయం. అయితే దీనిని కాలానుగతంగా అంతా మరచిపోయారు. ప్రజలే బానిసలుగా మారుతున్న వైనం వర్తమానంలో కనిపిస్తోంది. ప్రజల సొమ్ముని తమ సొంత సొమ్ము ఇస్తున్నట్లుగా చెప్పుకుంటూ పథకాల పేరుతో ఆర్భాటం చేసే నయా ప్రభువులు అడుగడుగునా కనిపిస్తున్నారు. ప్రజలే ఈ ప్రభువుల కరుణా కటాక్ష వీక్షణాల కోసం పడి గాపులు పడుతున్న సన్నివేశాలే ఎటు చూసినా కనిపిస్తున్నాయి.

**భోగాలు అన్నీ వారికి :**

ప్రజా సేవకులకు భోగాలు అన్నీ దక్కుతున్నాయి. కేవలం అయిదేళ్ళు పాలిస్తే చాలు జీవిత కాలం పెన్షన్ లభిస్తోంది. అంతే కాదు రైలు బస్సు విమానం ఇలా రవాణా సదుపాయాలు టెలిఫోన్ గ్యాస్ వంటి వాటిలో రాయితీలు ఎన్నో ఎన్నెన్నో దక్కుతున్నాయి ఈ అయిదేళ్ళూ తక్కువ కాదు, అధికారంలో ఉంటే బంగ్లాలు ఇస్తున్నారు, ఇక ఎక్కడ నుంచి ఎక్కడికి వెళ్ళినా అన్నీ ఉచితాలే. దాంతో పాత తరం సంగతి ఏమో కానీ జెన్ జీ తరం మాత్రం దీనిని చూసి సహించడం లేదు. ఏమిటీ వివక్ష అంటోంది. ప్రజా సేవకు వచ్చిన వారికి ఇన్నేసి సదుపాయాలు ఎందుకు అని ప్రశ్నిస్తోంది.

**సీజేపీ మానిఫేస్టో :**

బొద్దింక పార్టీ మేనిఫేస్టోని చూస్తే షాక్ కి గురి అవుతారు. ఇవే అక్కడ కనిపిస్తున్న విషయాలు. ప్రజా సేవకులకు ఎందుకు వైభోగాలు అని ప్రశ్నిస్తోంది జెన్ జీ తరం. వారికి బంగ్లాలు వద్దు, అందరి మాదిరిగానే నివాసాలు ఉండాలంటోంది. రాయితీల ఊసు అసలు వద్దు అంటోంది. భారీ ఎత్తున జీతాలు భత్యాలు ఆనక పెన్షన్లు ఇవన్నీ ఇవ్వడం ఏంటి అని మండిపడుతోంది. ఇలా వ్యవస్థలో దశాబ్దాలుగా ప్రజా సేవకులు అందుకుంటున్న అనేక రకాలైన సదుపాయాల మీద జెన్ జీ బిగ్ సౌండ్ చేస్తోంది. ఇవన్నీ పోవాలని కూడా గట్టిగా డిమాండ్ చేస్తోంది.

**జరిగే పనేనా :**

ఈ రోజున ప్రజాస్వామ్యంలో చూస్తే ఇవన్నీ సర్వ సాధారణం అని సాదర జనం అంతా సర్దుకుని పోతున్నారు. సగటు జీవి తన ప్రారబ్దంగా పేదరికం వచ్చిందని అనుకుంటున్నాడు తప్ప సేవకులను ప్రశ్నించడం ఏనాడో మరచిపోయాడు. ఇలా కాలాలు గతించిపోతున్నాయి కానీ ఎవరూ ఏమిటీ తీరు ని నిలదీయడం లేదు. కానీ జెన్ జీ తరం పెద్ద నోరు చేస్తోంది. అసలైన ప్రజాస్వామిక మౌలిక సూత్రాలను వల్లె వేస్తోంది. నిజమైన ప్రభువులు ప్రజలు కదా అని అంతా మరచిన సత్యాన్ని గుర్తు చేస్తోంది. ప్రభువులకు పాట్లూ సేవకులకు వైభోగాలు ఏమిటి అని కూడా ప్రశ్నిస్తోంది. సీజేపీ మేనిఫేస్టో ఇదీ అని సోషల్ మీడియాలో పెడితే నూటికి నూరు శాతం జెన్ జీ తరం సేవకులూ మనలాంటి వారే వారికి ఏ సౌకర్యాలూ వద్దు అని గట్టిగా నినదిస్తోంది అంటే మార్పు ఎక్కడో మొదలైపోయినట్లే అంటున్నారు. తరాలు మారుతున్నాయి. ఇపుడు ఎవరికీ మింగుడు పడని జెన్ జీ తరం వస్తోంది. దాంతో అంతా ఆలోచించాల్సిన సమయం వచ్చేసింది అని అంటున్నారు.

03

ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
కోర్టు పబ్లికేషన్ యాడ్స్
కేవలం
యాడ్ 500/-
'పొ. 12 సెం.మీ, వె. 8 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి'
93948 55244
షరతులు వర్తిస్తాయి

# వైసీపీలో సర్వేల కలవరం- సీటు విషయమేంటి ?



వైసీపీకి 2024 ఎన్నికలు అనేక విధాలుగా దెబ్బ తీసిన సంగతి తెలిసిందే. ఈ ఎన్నికలు ఇచ్చిన షాకులు చెప్పిన గుణ పాఠాలు చాలానే ఉన్నాయి. వైసీపీకి చెందిన సిట్టింగులను అలా మార్చుకుంటూ పోయారు. మంత్రుల నుంచి ఎమ్మెల్యేల నుంచి సీనియర్ల నుంచి ఎవరినీ వదలేదు. అలా దాదాపుగా వంద దాకా అసెంబ్లీ నియోజకవర్గాలలో సిట్టింగులను భారీగా చేంజ్ చేయడం వల్ల వైసీపీ చివరికి ఇబ్బందుల పాలు అయింది. లాస్ట్ మినిట్ లో కొత్త చోట్లకు వెళ్ళడం వల్ల సరిగ్గా పెర్ఫార్మ్ చేయలేకపోయారు. దాంతో దారుణంగా రిజల్ట్స్ వచ్చాయి. ఇక ఈసారి ఎక్కడి వారిని అక్కడే ఉంచుతూ ముందుగానే టికెట్లు ఇచ్చి ప్రోత్సహిస్తారు అని ఒక వైపు ప్రచారం సాగుతోంది. అయితే మరో వైపు చూస్తే ప్రతీ అసెంబ్లీ సీటుకు ముగ్గురేసి మంది నేతల పేర్లు పరిశీలించాలని పార్టీ ఆలోచిస్తోంది అన్న వార్తలు అయితే పార్టీలో కలవరం రేపుతున్నాయని అంటున్నారు.

**రెండేళ్ళ బట్టి అలా :**

ఇదిలా ఉంటే వైసీపీకి ఇంచార్జిలను నియమించారు. వీరంతా రెండేళ్ళ బట్టి పనిచేస్తున్నారు. మరో మూడేళ్ళు కష్టపడితే తామే అభ్యర్థులుగా పోటీకి దిగవచ్చు అన్న ఆలోచనలు వారికి ఉన్నాయి. కానీ ఇపుడు ప్రతీ నియోజకవర్గంలో ఆప్షన్లు పెట్టుకుంటూ పోతే చివరికి ఎవరికి టికెట్లు దక్కుతాయన్నది సందేహంగా ఉంది అని అంటున్నారు. ఇదిలా ఉంటే వైసీపీలో కీలక నేత మంగళగిరి నుంచి రెండు సార్లు గెలిచి వచ్చిన ఆళ్ల రామక్రిష్ణారెడ్డికి ఈసారి టికెట్ దక్కుతుందా అన్న చర్చ కూడా సాగుతోంది. అక్కడ మంత్రి నారా లోకేష్ ఉన్నారు. ఆయన మీద గట్టి అభ్యర్ధిని ఎంపిక చేయాలని వైసీపీ అధినాయకత్వం చూస్తోంది అని వార్తలు ప్రచారంలో ఉన్నాయి. దాంతో ఆళ్ళను కాకుండా వేరే వారిని పోటీకి దించుతారు అని అంటున్నారు. మరి ఆళ్ళ లాంటి వారికే సీటు గ్యారంటీ లేదా అన్న చర్చ కూడా పార్టీలో సాగుతోంది.

**ముందుగా ప్రకటిస్తేనే :**

వైసీపీ విపక్షంలో ఉంది. దాంతో పార్టీని జనంలోకి తీసుకుని వెళ్ళాల్సిన అవసరం కూడా ఉంది. తమకు ఉన్న ఆర్థిక వనరులను ఇంచార్జులుగా ఉన్న వారి ఖర్చు చేయాల్సి ఉంటుంది. వారికి టికెట్ భరోసా కనుక కల్పించకపోతే వారు ఉత్సాహంగా పనిచేయరని అంటున్నారు. ఇక ప్రతిపక్షం పార్టీకి అడ్వాంటేజ్ కూడా ఉందని ముందుగా అభ్యర్థులను ప్రకటించి రంగంలోకి దించితే వారు మరింతగా ప్రజలకు చేరువ అవుతారని అంటున్నారు. ఆ విధంగా బలమైన అభ్యర్థులు అనుకున్న వారిని అలాగే కొనసాగించాలని అంటున్నారు. అంతే తప్ప ఆప్షన్లు పెట్టుకుని ముగ్గురు నలుగురుని అని చూసి చివరి వరకూ ఆలోచించి ఎవరో ఒకరిని ప్రకటించాలని చూస్తే అప్పటి దాకా పార్టీ కార్యక్రమాలు అనుకున్నంత ఊపుగా సాగవని చివరి నిముషంలో అభ్యర్థులు అయిన వారు సర్దుకునే సమయం లేక ఆశించిన ఫలితాలు కూడా రావని అంటున్నారు. మరి అధినాయకత్వం అభ్యర్థుల విషయంలో సర్వేలు చేయిస్తోంది అన్న వార్తలు ఏ మేరకు వాస్తవం అన్నది ఒకటి అయితే అవే నిజం అయితే మాత్రం ఇబ్బంది అని పార్టీలో చర్చ సాగుతోంది. చూడాలి మరి ఏమి జరుగుతుందో.

# పవన్ ఆలోచన సక్సెస్ అయితే.. 50 వేల మందికి ఉద్యోగం!

ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఆలోచనలు భిన్నంగా ఉంటాయి. పైకి ఆయన ఏమీ ప్రకటించరు. కానీ, చేసి చూపిస్తారు. తను చేసే పనికి పెద్దగా ప్రచారం కూడా కోరుకోరు. కానీ, ఫలితం కావాలని ఆశిస్తారు.ఇలా.. రాష్ట్రంలో ఆయన ఉప ముఖ్యమంత్రి అయ్యాక.. అనేక కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఫలితాలను కూడా రాబట్టారు. గ్రామీణ ప్రాంతాల్లో రహదారుల నుంచి వీధి దీపాల వరకు ప్రస్తుతం వెలుగు చిమ్ముతున్నాయి. ఇక, గిరిజన ప్రాంతాల్లో ఒకప్పుడు అంధకారంలో మగ్గిన కుటుంబాలకు ఇంటింటికీ కరెంటు ఇచ్చే పరిస్థితి ఏర్పడింది. అటవీ ఉత్పత్తులకు మార్కెటింగ్ నుంచి ఎర్రచందనానికి భద్రత వరకు.. అనేక విధాలుగా పవన్ కల్యాణ్ తీసుకుంటున్న చర్యలు సత్ఫలితాలను ఇస్తున్నాయి. తాజాగా ఆయన ఆలోచన మరింత విస్తరించింది. ఇది కనుక సక్సెస్ అయితే.. దాదాపు 50వేల మంది యువతకు.. ముఖ్యంగా నిరుద్యోగులకు ఉద్యోగాలు లభిస్తాయి. దీనికి ఆమోదం పొందడం కూడా సులువేనని అధికా రులు చెబుతున్నారు. తద్వారా.. రాష్ట్రంలో ఒక జనరేషన్‌కు పెద్ద ఎత్తున ఉద్యోగం లభించడం.. సంచలనంగా మారనుందని అంటున్నారు.

**ఏంటా ఆలోచన..**

ప్రస్తుతం రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ ఆధ్వర్యంలోని, ప్రభుత్వ పర్యవేక్షణలోని ఆలయాలు వందలాది ఉన్నాయి. ఇవి కాకుండా ప్రైవేటు ఆలయాలు కూడా ఉన్నాయి. ఆయా ఆలయాలకు భారీ సంఖ్యలో భక్తులు పెరుగుతున్నారు. ఒకప్పుడు పర్వదినాల సమయంంలోనే ఎక్కువ మంది భక్తులు వచ్చేవారు. కానీ, ఇప్పుడు సందర్భంతో పనిలేకుండా భక్తులు పోటెత్తుతున్నారు. ఈ క్రమంలో వారికి భద్రత కల్పించడం.. సర్కారుకు ఇబ్బందికరంగా మారుతోంది. ఎందుకంటే.. భద్రతకు.. ఇటు సొసైటీలో అయినా.. అటు ఆలయాల వద్దైనా.. సివిల్ పోలీసులనే నియమించాల్సి ఉంటుంది.కానీ రాష్ట్రంలో సాధారణ విధులకే సివిల్ పోలీసుల సంఖ్య సరిపోయేలా కనిపించడం లేదు. దీంతో కేసులు పెండింగులో పడుతు న్నాయి. ఈ నేపథ్యంలో ఆలయాలకు ప్రత్యేకంగా భద్రతా సిబ్బందిని నియమించాలని.. అది కూడా ప్రభుత్వ ఆధ్వర్యంలోనే ఉండాలన్నది పవన్ కల్యాణ్ ఆలోచన.దీనికి సంబంధించి ఆయన పెద్ద ప్రణాళికపైనే కసరత్తు చేశారు. ఇతర దేశాలు, రాష్ట్రాల నుంచి కొత్త ప్రదేశాలు చూసేందుకు రాష్ట్రానికి వచ్చే వారికి పూర్తి భద్రత కల్పించేందుకు 'పర్యాటక పోలీసు' విధానంపై ఆయన కసరత్తు చేశారు.అయితే.. దీనికి సీఎం చంద్రబాబు నేతృత్వంలోని మంత్రి వర్గం ఓకే చెప్పాల్సి ఉంటుంది. అదేవిధంగా నియమనిబంధనలు కూడా రూపొందించాలి. ఇది కనుక పూర్తయితే.. రాష్ట్ర వ్యాప్తంగా 50 వేల మంది పర్యాటక పోలీసులు అందుబాటులోకి వస్తారు. తద్వారా.. యువతకు ఉద్యోగాలు లభించనున్నాయి. అలానే పర్యాటక ప్రాంతాల్లో భద్రతతోపాటు.. ఆలయాలకు కూడాభద్రత మరింత, పారదర్శకత లభిస్తాయని పవన్ ఆలోచనగా ఉంది.

# వైసీపీ బీఆర్ఎస్.... ఇదే లాస్ట్ చాన్స్ ?



ఏపీలో వైసీపీ తెలంగాణాలో బీఆర్ఎస్ ఈ రెండు పార్టీలూ ఒకే పడవలో ప్రయాణం చేస్తున్నాయి. రెండూ ఒకే సమయంలో అధికారంలో కొనసాగాయి. అలాగే ఒకేసారి ఓటమిని అందుకున్నాయి. ఈ రెండు పార్టీల అధినాయకత్వాలకు మంచి స్నేహ సంబంధాలు ఉన్నాయి. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ తో వైసీపీ అధినేత జగన్ కి మంచి దోస్తీ ఉందని కూడా ప్రచారంలో ఉన్న మాట. ఇక రాజకీయ విధానాలు వ్యూహాలు ఆలోచనలు కూడా ఈ రెండు పార్టీలదీ ఒకేలా ఉంటుందని అంటారు. అదే సమయంలో ఈ రెండు పార్టీలూ పోరాడుతున్న అధికార పార్టీలు కూడా ఏపీ తెలంగాణాలలో విపక్షం మీద గట్టిగానే ఉక్కు పాదం మోపుతున్నవే కావడం విశేషం. ఏపీలో విశేష అనుభవం కలిగిన చంద్రబాబు నాలుగవ సారి సీఎం గా ఉంటే తెలంగాణలో రేవంత్ రెడ్డి తొలిసారి సీఎం అయినా డైనమిక్ గా ముందుకు సాగుతున్నారు.

**ఎక్కడికక్కడ కంట్రోల్ :**

ఏపీలో చంద్రబాబు వర్సెస్ జగన్ రాజకీయం చూస్తే వైసీపీని పూర్తిగా కట్టడి చేయాలన్న వైఖరితో టీడీపీ అధినాయకత్వం ఉంది. ఆ దిశగానే గ్రౌండ్ లెవెల్ నుంచి టాప్ లెవెల్ వరకూ వ్యూహ రచన సాగుతోంది. ఏ రోజుకి ఆ రోజు కొత్త వ్యూహాలతో ఎత్తులతో టీడీపీ వైసీపీని చిత్తు చేసే విధంగా దూకుడు చేస్తూ వస్తోంది. ఒక నేరేషన్ కి జనంలో బిల్డప్ చేయడం ద్వారా వైసీపీ మీద నెగెటివిటీని క్రమబద్ధంగా పెంచే వ్యూహాన్ని టీడీపీ అధినాయకత్వం పక్కాగా అమలు చేస్తోంది. వైసీపీ అయితే రొటీన్ గా ఓల్డ్ ట్రెండ్ పాలిటిక్స్ నే నమ్ముకుంటోంది. దాంతో వ్యూహాల పరంగా టీడీపీది ఏపీలో పై చేయి అవుతోంది అని అంటున్నారు.

**రేవంత్ జోరుగానే :**

ఇక తెలంగాణాలో చూస్తే రేవంత్ రెడ్డి మంచి మాటకారి. అదే సమయంలో వ్యూహకర్త. ఆయన బీఆర్ఎస్ ఒకటి అంటే రెండు అన్నట్లుగా జోరు చేస్తున్నారు. ఎక్కడ ఏ మాత్రం గులాబీ పార్టీ కారు ముందుకు కదలకుండా తన శైలిలో పథక రచన చేస్తూ కట్టడి చేస్తున్నారు. కేసీఆర్ వ్యూహాల పుట్ట అని వాగ్దాటిలో ఆయనకు సరిసాటి లేరని అంతా అనుకున్న తరుణంలో రేవంత్ రెడ్డి వచ్చి అతనిని మించిన ఘనుడిని అన్నట్లుగా తన రాజకీయ విశ్వ రూపానే చూపిస్తూ వస్తున్నారు. దాంతో బీఆర్ ఎస్ కారు కూడా అక్కడ నెమ్మదిగానే కదులుతున్న నేపథ్యం ఉంది.

**ఇదే లాస్ట్ చాన్స్ :**

ఇక ఏపీలో చూస్తే చంద్రబాబు లోకేష్ తరచూ ఒకే మాట అంటూ వస్తున్నారు. వైసీపీకి ఒక్కటే చాన్స్ ఇచ్చారని అయిదేళ్ళ పాటు అరాచక పాలన చేసి జన విశ్వాసం కోల్పోయారని మరోసారి ఆ పార్టీకి అధికారం దక్కడం కల్ల అని కూడా క్లారిటీగా చెప్పేస్తున్నారు. వైసీపీకి 2024 ఎన్నికలే చివరి ఎన్నికలు అని మంత్రులు గొట్టిపాటి రవి కుమార్ లాంటి వారు సైతం చెబుతున్నారు. ఈ విధంగా వైసీపీ మీద సైకలాజికల్ గేం కి టీడీపీ తెర తీస్తోంది. అదే సమయంలో తెలంగాణాలోనూ బీఆర్ఎస్ కి 2023తోనే అధికారం పోయిందని ప్రతిపక్షమే శాశ్వతమని కాంగ్రెస్ నేతలు అంటున్నారు.

**ఒకే విధమైన జోస్యం :**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అయితే 2034 లో కూడా కాంగ్రెస్ గెలుస్తుందని చెబుతున్నారు. అంటే మరో రెండు ఎన్నికల్లో అన్న మాట. అంటే బీఆర్ఎస్ ఆశలు వదిలేసుకోవాలనే చెబుతున్నట్లుగా ఈ తీరు ఉంది. తాజాగా పీసీసీ చీఫ్ మహేష్ గౌడ్ కూడా ఇదే మాట అన్నారు. బీఆర్ ఎస్ కి పవర్ దక్కడం అన్నది జరగదని కుండ బద్దలు కొట్టేశారు. ఇవన్నీ చూసినపుడు వైసీపీకి బీఆర్ఎస్ కి ఒకే విధమైన జోస్యాన్ని చెబుతున్నారు. మరి నిజంగా అలాగే జరుగుతుందా వైసీపీ కానీ బీఆర్ఎస్ కానీ అధికరంలోకి రాలేవా క్యాడర్ వీటిని ఏ విధంగా తీసుకుంటారు, వారు డీమోరలైజ్ అయితే పార్టీలకు ఇబ్బంది కదా అన్న చర్చ అయితే వస్తోంది. చూడాలి మరి అటు కారు ఇటు ఫ్యాన్ రెండూ స్పీడ్ పెంచాలంటే చేయాల్సిన కసరత్తు చాలానే ఉంది అని అంటున్నారు.

# ముగ్గురు సీఎంలు తాకలేని మసీదు.. ఇప్పుడు సువేందు టార్గెట్టా?




పశ్చిమ బెంగాల్ రాజకీయాల్లో మరోసారి మతం, భద్రత, ఓటు బ్యాంక్ రాజకీయాలు ఒకే వేదికపైకి వచ్చాయి. కోల్‌కతాలోని నేతాజీ సుభాష్ చంద్రబోస్ అంతర్జాతీయ విమానాశ్రయం పక్కనే ఉన్న 136 ఏళ్ల "బంక్రా మసీదు" ఇప్పుడు జాతీయ చర్చగా మారింది. దశాబ్దాలుగా ప్రభుత్వాలు తాకడానికి కూడా వెనుకంజ వేసిన ఈ అంశం.. ఇప్పుడు బీజేపీ నాయకుడు సువేందు అధికారి పేరు చుట్టూ తిరుగుతోంది.

**అసలు సమస్య ఏమిటి?**

"గౌరీపసూర్ జామే మస్జిద్"గా అధికారికంగా పిలిచే ఈ మసీదు.. విమానాశ్రయం రెండో రన్‌వేకి కేవలం 165 మీటర్ల దూరంలో ఉంది. కానీ విమానయాన భద్రతా నిబంధనల ప్రకారం కనీసం 240 మీటర్ల క్లియరెన్స్ అవసరం. అంటే సాంకేతికంగా చూస్తే.. ఈ నిర్మాణం 'రిస్క్ జోన్'లో ఉన్నట్టే.

ఈ కారణంగా పెద్ద విమానాల ల్యాండింగ్ సమయంలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాల్సి వస్తోంది. టచ్‌డౌన్ పాయింట్‌ను 88 మీటర్లు మార్చినట్లు అధికారులు చెబుతున్నారు. అత్యవసర పరిస్థితుల్లో ప్రమాదాల అవకాశాలు పెరిగే ప్రమాదం ఉందన్నది విమానయాన నిపుణుల వాదన.

**కానీ.. ఇంతకాలం ఎందుకు మౌనం?**

ఇదే ఇప్పుడు పెద్ద రాజకీయ ప్రశ్నగా మారింది. సీపీఎం హయాంలో జ్యోతి బసు, బుద్ధదేవ్ భట్టాచార్జీ వంటి ముఖ్యమంత్రులు ఈ అంశాన్ని ఫైళ్లకే పరిమితం చేశారని విమర్శలు ఉన్నాయి. మమతా బెనర్జీ ప్రభుత్వమూ ఇదే దారిలో నడిచిందని బీజేపీ ఆరోపిస్తోంది. కారణం ఒక్కటే అంటున్నారు విశ్లేషకులు "ఓటు బ్యాంక్ రాజకీయాలు". మసీదు తరలింపు అంశం మతపరమైన ఉద్రిక్తతలకు దారితీసే అవకాశం ఉండటంతో.. ఏ ప్రభుత్వం కూడా సాహసం చేయలేదన్న అభిప్రాయం ఉంది. విమాన భద్రత కంటే రాజకీయ నష్టం పెద్దదిగా కనిపించిందనే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి.

**ఇప్పుడు సువేందు ఎందుకు చర్చలోకి వచ్చారు?**

బెంగాల్‌లో బీజేపీ బలపడుతున్న నేపథ్యంలో.. ఈ అంశాన్ని "భద్రతా సమస్య"గా ప్రొజెక్ట్ చేయాలని కమలం పార్టీ చూస్తోందని రాజకీయ వర్గాలు చెబుతున్నాయి. సువేందు అధికారి తరచూ "అక్రమ ఆక్రమణలు", "రాష్ట్ర భద్రత", "ప్రభుత్వాల తటస్థ వైఖరి" వంటి అంశాలపై మమతా ప్రభుత్వాన్ని టార్గెట్ చేస్తున్నారు. దీంతో బంక్రా మసీదు వ్యవహారం కూడా రాజకీయంగా మరింత హీట్ తెచ్చుకుంది.

అయితే బీజేపీ అనుకూల వర్గాలు దీన్ని "ప్రయాణికుల భద్రత"గా చూపిస్తుంటే.. టీఎంసీ శ్రేణులు మాత్రం "మత రాజకీయాల కోసం అంశాన్ని రగిలిస్తున్నారు" అని ఎదురుదాడి చేస్తున్నాయి.

**మసీదులో పరిస్థితి ఎలా ఉంది?**

ప్రస్తుతం రోజుకు 10 నుంచి 25 మంది వరకు మాత్రమే అక్కడ నమాజ్ చేస్తున్నట్లు సమాచారం. శుక్రవారాల్లో ఈ సంఖ్య 80 వరకూ చేరుతోంది. ప్రార్థనలకు వచ్చే వారిని సీఐఎస్ఎఫ్ సిబ్బంది ఐడీ చెక్ చేసి మాత్రమే లోపలికి అనుమతిస్తున్నారు. అంటే భద్రతా పరిమితుల్లోనే ప్రార్థనలు జరుగుతున్నాయి. ఇక ఇటీవల ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా అధికారులు మసీదు కమిటీతో సమావేశమై తరలింపు అంశంపై చర్చలు జరిపారు. బక్రీద్ పూర్తయ్యే వరకు ఎలాంటి నిర్ణయం తీసుకోకూడదని అధికారులు నిర్ణయించారు. ఈద్ తర్వాత అసలు నిర్ణయం వచ్చే అవకాశముంది.

ఇది కేవలం మసీదు సమస్యేనా? అంటే కాదు ఇది మూడు కోణాల కథ. విమాన భద్రత, మత సెంటిమెంట్ రాజకీయ లాభనష్టాలు ఉంటాయి. ఈ మూడు ఒకేసారి కలిసినప్పుడు.. ఏ ప్రభుత్వం అయినా అడుగు వెనక్కే వేస్తుంది. అందుకే ముగ్గురు సీఎంలు చేయలేని పని ఇప్పుడు సువేందు అధికారి చేయగలరా? అన్న ప్రశ్న ఆసక్తికరంగా మారింది.

ఒకవేళ మసీదు తరలింపు జరిగితే.. అది "భద్రతా విజయమా?" లేక "రాజకీయ సంకేతమా?" అన్న చర్చ దేశవ్యాప్తంగా మళ్లీ మొదలయ్యే అవకాశం ఉంది.

# టీ20 క్రికెట్లో చరిత్ర సృష్టించిన రువాండా బ్యాటర్

- టీ20 అంతర్జాతీయ క్రికెట్‌లో రువాండా బ్యాటర్ హంజా ఖాన్ సంచలనం
- 65 బంతుల్లో 164 పరుగులతో రెండో అత్యధిక వ్యక్తిగత స్కోరు నమోదు
- హంజా ఇన్నింగ్స్‌లో 9 ఫోర్లు, 15 సిక్సర్లు
- రువాండా 288 పరుగులు చేయగా, ఐవరీ కోస్ట్ 17 పరుగులకే ఆలౌట్
- 271 పరుగుల భారీ తేడాతో రువాండా చారిత్రాత్మక విజయం




**హైదరాబాద్ పెన్ పవర్:** టీ20 అంతర్జాతీయ క్రికెట్‌లో రువాండా ఆటగాడు హంజా ఖాన్ సరికొత్త చరిత్ర సృష్టించాడు. ఐవరీ కోస్ట్‌తో జరిగిన మ్యాచ్‌లో కేవలం 65 బంతుల్లో అజేయంగా 164 పరుగులు చేసి రికార్డుల మోత మోగించాడు. ఈ అద్భుత ఇన్నింగ్స్‌తో పురుషుల టీ20 ఫార్మాట్‌లో రెండో అత్యధిక వ్యక్తిగత స్కోరు నమోదు చేసి, చరిత్ర పుటల్లోకి ఎక్కాడు. ఆదివారం నాడు ఐసీసీ పురుషుల టీ20 ప్రపంచకప్ ఆఫ్రికా సబ్-రీజనల్ క్వాలిఫయర్‌లో ఈ అద్భుతం చోటుచేసుకుంది. హంజా ఖాన్ తన విధ్వంసకర ఇన్నింగ్స్‌లో 9 ఫోర్లు, 15 భారీ సిక్సర్లు బాదాడు. అతని స్ట్రైక్ రేట్ 252.30గా నమోదైంది. ఈ ఇన్నింగ్స్‌తో అతను 2019లో ఐర్లాండ్‌పై ఆఫ్ఘనిస్థాన్ ఆటగాడు హజ్రతుల్లా జజాయ్ చేసిన 162 పరుగుల రికార్డును అధిగమించాడు. ప్రస్తుతం ఈ జాబితాలో ఆస్ట్రేలియా ఆటగాడు ఆరోన్ ఫించ్ నెంబర్ వన్ గా ఉన్నాడు. 2018లో జింబాబ్వేపై ఆరోన్ ఫించ్ 172 పరుగులతో రికార్డు సృష్టించాడు. ఇప్పుడు ఫించ్ తర్వాత రెండో స్థానంలో హంజా ఖాన్ నిలిచాడు.
హంజా ఖాన్ అద్భుత బ్యాటింగ్‌తో రువాండా జట్టు 20 ఓవర్లలో 2 వికెట్ల నష్టానికి 288 పరుగుల భారీ స్కోరు సాధించింది. ఇది టీ20 చరిత్రలో ఏడో అత్యధిక జట్టు స్కోరు కావడం విశేషం. అనంతరం లక్ష్య ఛేదనకు దిగిన ఐవరీ కోస్ట్ జట్టు, రువాండా బౌలర్ల ధాటికి కేవలం 17 పరుగులకే కుప్పకూలింది. ఇది టీ20ల్లో ఐదో అత్యల్ప స్కోరు.దీంతో రువాండా జట్టు 271 పరుగుల భారీ తేడాతో చారిత్రాత్మక విజయం సాధించింది. టీ20 ఫార్మాట్‌లో పరుగుల పరంగా ఇది మూడో అతిపెద్ద విజయం. ఈ ఒక్క మ్యాచ్‌తో రువాండా క్రికెట్‌తో పాటు హంజా ఖాన్ పేరు కూడా ప్రపంచవ్యాప్తంగా ప్రాచుర్యం పొందింది.

# ముంబైపై విజయం.. ప్లేఆఫ్స్‌కు రాజస్థాన్





**హైదరాబాద్ పెన్ పవర్:** ఐపీఎల్ 2026లో ముంబయి ఇండియన్స్‌తో జరిగిన తమ చివరి లీగ్ మ్యాచ్‌లో రాజస్థాన్ రాయల్స్ 30 పరుగుల తేడాతో విజయం సాధించింది. ఈ గెలుపుతో రాజస్థాన్ చివరి ప్లే ఆఫ్స్ బెర్తు ఖరారు చేసుకుంది. 206 పరుగుల లక్ష్యంతో ఛేదనకు దిగిన ముంబయి.. నిర్ణీత 20 ఓవర్లలో 175/9 పరుగులు మాత్రమే చేసింది. సూర్య కుమార్ యాదవ్ (60; 42 బంతుల్లో 3 ఫోర్లు, 4 సిక్సులు) పోరాడినా ముంబయికి ఓటమి తప్పలేదు. హార్దిక్ పాండ్య 34, విల్ జాక్స్ 33 రన్స్ చేశారు. రాజస్థాన్ బౌలర్లలో జోఫ్రా ఆర్చర్ 3 వికెట్లు.. యశ్ రాజ్, నాండ్రే బర్గర్, బ్రిజేశ్ శర్మ తలో 2 వికెట్లు పడగొట్టారు. ఈ మ్యాచ్‌లో రాజస్థాన్ విజయం సాధించడంతో కోల్‌కతా, పంజాబ్ ప్లే ఆఫ్స్ ఆశలు ఆవిరయ్యాయి. దీంతో ప్రస్తుతం ఢిల్లీ, కేకేఆర్ మధ్య జరుగుతున్న మ్యాచ్ నామమాత్రంగా మారింది. అంతకుముందు బ్యాటింగ్‌కు దిగిన రాజస్థాన్ రాయల్స్ నిర్ణీత 20 ఓవర్లలో 205/8 పరుగులు చేసింది. ధ్రువ్ జురెల్ 38, జోఫ్రా ఆర్చర్ 32, శనక 29, యశస్వి జైస్వాల్ 27, ఫెరీరా 18, పరాగ్ 14, శుభమ్ దూబె 5, వైభవ్ సూర్యవంశీ 4, జడేజా 19లి, నాండ్రె బర్గర్ 10లి రన్స్ చేశారు. వీ× బౌలర్లలో దీపక్ చాహర్, శార్దూల్ ఠాకూర్ చెరో 2 వికెట్లు పడగొట్టారు. విల్ జాక్స్, ఘజన్‌ఫర్, బాష్ తలో వికెట్ తీశారు.

# ఢిల్లీ దెబ్బకు కేకేఆర్ ఖల్లాస్.. లీగ్ చివరి మ్యాచ్‌లోనూ ఓడిన కోల్‌కతా





లీగ్ స్టేజ్ ఆఖరి పోరులో ఈడెన్ గార్డెన్స్ వేదికగా కోల్‌కతా నైట్ రైడర్స్ తో జరిగిన మ్యాచ్‌లో ఢిల్లీ క్యాపిటల్స్ బౌలర్లు చెలరేగిపోయారు. టాస్ ఓడిపోయి ఫస్ట్ బ్యాటింగ్ చేసిన ఢిల్లీ 20 ఓవర్లలో 203 పరుగులు చేయగా.. 204 రన్స్ లక్ష్యంతో బరిలోకి దిగిన కేకేఆర్ టీమ్‌ను ఢిల్లీ బౌలర్లు ముప్పు తిప్పలు పెట్టారు. కోల్‌కతా బ్యాటర్లు గట్టిగా పోరాడినప్పటికీ కీలక సమయాల్లో వికెట్లు కోల్పోయి 18.4 ఓవర్లలోనే 163 పరుగులకి ఆలౌట్ అయింది. దీంతో ఢిల్లీ 40 పరుగుల తేడాతో ఘన విజయంతో లీగ్ చివరి మ్యాచ్ ని ముగించింది.

**కుల్దీప్ యాదవ్ దెబ్బ:**
భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన కేకేఆర్ జట్టుకు ఓపెనర్లు మంచి ఆరంభాన్ని ఇచ్చారు. అజింక్య రహానే, ఫిన్ అలెన్ క్రీజులో నిలదొక్కుకుని స్కోరు బోర్డును పరిగెత్తించారు. కానీ, వీరిద్దరి మధ్య నెలకొన్న 43 పరుగుల భాగస్వామ్యానికి చైనామన్ స్పిన్నర్ కుల్దీప్ యాదవ్ బ్రేక్ వేసిండు. ప్రమాదకరంగా మారుతున్న ఫిన్ అలెన్ (20)ను కుల్దీప్ బౌలింగ్‌లో డేవిడ్ మిల్లర్ అద్భుతమైన క్యాచ్‌తో అవుట్ చేశాడు.

మనీష్ పాండే ఫైట్.. కుల్దీప్ షాక్:
అలెన్ అవుట్ అయిన తర్వాత క్రీజులోకి వచ్చిన మనీష్ పాండే కాసేపు దూకుడుగా బ్యాటింగ్ చేసి జట్టును ఆదుకునే ప్రయత్నం చేశాడు. కానీ, టీమ్ స్కోరు 87 పరుగుల వద్ద ఉన్నప్పుడు లుంగి ఎంగిడి బౌలింగ్‌లో మిచెల్ స్టార్క్‌కు క్యాచ్ ఇచ్చి మనీష్ పాండే పెవిలియన్‌కు చేరాడు. ఆ వెంటనే కేకేఆర్‌కు కుల్దీప్ యాదవ్ కోలుకోలేని బిగ్ షాక్ ఇచ్చిండు. కిరాక్ బౌలింగ్‌తో విరుచుకుపడిన కుల్దీప్.. కామెరాన్ గ్రీన్ (2), రింకు సింగ్‌లను వరుస బంతుల్లో అవుట్ చేసి నైట్ రైడర్స్ నడుము విరిచేశాడు.

**స్టార్క్ విధ్వంసం:**
వరుస వికెట్లతో కష్టాల్లో పడ్డ కేకేఆర్‌ను కోలుకోకుండా చేయడంలో కెప్టెన్ అక్షర్ పటేల్ కీలక పాత్ర పోషించాడు. క్రీజులోకి వచ్చిన తేజస్వి దహియాను అక్షర్ క్లీన్ బౌల్డ్ చేయడంతో మ్యాచ్ పూర్తిగా ఢిల్లీ వైపుకు తిరిగింది. ఇక ఆఖర్లో 18వ ఓవర్ వేసిన మిచెల్ స్టార్క్ తన పేస్‌తో మాయ చేశాడు. ఆ ఓవర్లో వరుసగా మూడు వికెట్లు (రోవ్‌మన్ పావెల్ రనౌట్ తో పాటు అనుకూల్ రాయ్, కార్తీక్ త్యాగి) అవుట్ చేసి కేకేఆర్ పతనాన్ని శాసించాడు. ఢిల్లీ బౌలర్ల కిరాక్ ప్రదర్శనతో 163 రన్స్‌కే కేకేఆర్ ఆలౌట్ అవ్వగా.. ఢిల్లీ క్యాపిటల్స్ ఈ ఆఖరి మ్యాచ్‌లో 40 రన్స్ తేడాతో గెలిచి సీజన్‌ను ముగించింది.

# రుక్మిణి వసంత్ స్ఫూర్తిదాయక ప్రయాణం!



సీరత్ కపూర్ సిల్క్ చీరలో టైమ్‌లెస్ గాంభీర్యంతో స్టన్ చేసింది

కన్నడ చిత్ర పరిశ్రమ నుంచి భారతీయ సినీ వేదికపై అత్యంత వేగంగా దూసుకుపోతున్న యువ నటీమణుల్లో రుక్మిణి వసంత్ ఒకరు. -కాంతార: చాప్టర్ 1- చిత్రంలో అమ్మడు పోషించిన కనకవతి పాత్ర దేశవ్యాప్తంగా సినీ ప్రియుల మనసులను గెలుచుకుంది. ఈ భారీ సక్సెస్ సొగసరిని ప్యాన్-ఇండియా స్టార్‌గా నిలబెట్టడమే కాదు. పరిశ్రమలో రుక్మిణి అపారమైన ప్రతిభను పరిచయం చేసింది. అయితే అమ్మడు కేవలం వెండితెరపైనే కాకుండా నిజ జీవితంలోనూ స్ఫూర్తిదాయకమైన నేపథ్యాన్ని కలిగి ఉందని ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది.

రుక్మిణి వసంత్ భారత సైన్యంలో దేశం కోసం ప్రాణాలర్పించిన వీర జవాన్ కుమార్తె. ఆమె తండ్రి కల్నల్ వసంత్ వేణుగోపాల్. 2007లో జమ్మూ కాశ్మీర్‌లోని ఉరీ సెక్టార్‌లో ఉగ్రవాదుల చొరబాటును అడ్డుకునే క్రమంలో వీరమరణం పొందారు. దేశ రక్షణ కోసం ఆయన చేసిన అత్యున్నత త్యాగానికి గాను భారత ప్రభుత్వం ఆయనకు మరణానంతరం అత్యున్నత సైనిక పురస్కారమైన అశోక చక్రతో సత్కరించింది. కర్ణాటక రాష్ట్రం నుండి గౌరవాన్ని అందు కున్న మొదటి వ్యక్తి ఆయనే కావడం విశేషం. చిన్న వయసులోనే తండ్రిని కోల్పోయిన రుక్మిణి ఆర్మీ వాతావరణంలో క్రమశిక్షణతో పెరిగింది.

తండ్రి మరణం తర్వాత రుక్మిణి జీవితాన్ని ఆమె ఆలోచనా విధానాన్ని ఆమె తల్లి సుభాషిణి వసంత్ ఎంతగానో ప్రభావితం చేశారు. భర్తను కోల్పోయిన తీవ్ర దుఃఖాన్ని భరిస్తూనే ఆ తల్లి వీర రత్న అనే స్వచ్ఛంద సంస్థను స్థాపించి అమరవీరుల కుటుంబాలకు, వారి పిల్లల చదువుల కోసం ఎంతో కృషి చేశారు. బాధను ఎదుర్కొని సమాజానికి తిరిగి సేవ చేయడం ఎలాగో తన తల్లిని చూసే నేర్చుకున్నానని రుక్మిణి పలు సందర్భాల్లో పేర్కొన్నారు. ఆర్మీ నేపథ్యం ఆమెలో ఓ దృఢమైన వ్యక్తిత్వాన్ని, సమాజం పట్ల బాధ్యతాయుతమైన దృక్పథాన్ని పెంపొం దించింది.

కళల పట్ల చిన్నప్పటి నుంచే ఆసక్తి ఉన్న రుక్మిణి లండన్‌లోని ప్రతిష్టాత్మక రాయల్ అకాడమీ ఆఫ్ డ్రామాటిక్ ఆర్ట్స్ లో నటనలో శిక్షణ పొందింది. అటుపై 2019లో కన్నడ చిత్రం -బీర్బల్ ట్రైలజీ- తో చిత్ర పరిశ్రమలోకి అడుగు పెట్టింది. అనంతరం -సప్త సాగరదాచే ఎల్లో- వంటి భావోద్వేగభరితమైన చిత్రాల ద్వారా నటిగా తనదైన ముద్ర వేసింది. గ్లామర్ పాత్రలకే పరిమితం కాకుండా నటనకు ప్రాధాన్యమున్న పాత్రలను ఎంచుకుంటూ



విమర్శకుల ప్రశంసలు అందుకుంది. -కాంతార: చాప్టర్ 1- చిత్రం రుక్మిణి కెరీర్‌ను మలుపు తిప్పింది. ాలుగో శతాబ్దపు యోధ యువరాణి -కనకవతి- పాత్ర కోసం ఆమె పడిన కష్టం సామాన్యమైనది కాదు. ఈ పాత్ర హావభావాలను, రాజసం ఉట్టిపడే నడకను ఒంట బట్టించుకోవడానికి షూటింగ్‌కు ముందే ప్రత్యేక వర్క్‌షాప్‌లలో పాల్గొంది. అంతేకాదు కత్తిసాము , గుర్రపు స్వారీ వంటి కఠినమైన విద్యలలో శిక్షణ పొందింది. తెరపై అద్భుతమైన యాక్షన్ సీక్వెన్స్‌లను పండించి ప్రేక్షకులను ఆశ్చర్యపరిచింది. ప్రస్తుతం రుక్మిణి వసంత్ భారీ పాన్ ఇండియా సినిమాల్లో నటిస్తోంది. యంగ్ టైగర్ ఎన్టీఆర్ నటిస్తోన్న -డ్రాగన్- లో ఈ బ్యూటీనే హీరోయిన్. అలాగే కన్నడలో యశ్ నటిస్తోన్న మరో పాన్ ఇండియా చిత్రం -టాక్సిక్- లోనూ నటిస్తోంది. ఇలా ఒకేసారి రెండు భారీ ప్రాజెక్ట్ ల్లో నటించడంతో క్రేజ్ పీక్స్ లో ఉంది.



సాక్షి మాలిక్ అద్భుతమైన గ్లామరస్ లుక్‌లో తలదాచుకుంది

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, ONGOLE MANDAL, prakasam district, Andhrapradesh-523001. and published at D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, ONGOLE MANDAL, prakasam district, Andhrapradesh-523001. Editor: GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/25/A2230, editorpenpower@gmail.com